మా అక్షరాలు - నిజాల నిప్పుకణికలు

# ప్రజా మంటలు

సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 220 వెల - రూ 5:00

తెలంగాణ జాతీయ దినపత్రిక

Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnag Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yad



## సుప్రీంకోర్టును ఆశ్రయించిన గ్రూప్-1 అభ్యర్థులు



న్యూఢిల్లీ, (ప్రజా మంటలు):
రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 29 రద్దు చేయాలని కోరుతూ తెలంగాణ గ్రూప్-1 అభ్యర్థులు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తీర్పు వచ్చే వరకు పరీక్ష వాయిదా వేయాలని కోరారు.జీవో 55నే అమలు చేయాలని కోరినా సీఎం పట్టించుకోవడం లేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. తదుపరి విచారణను సుప్రీంకోర్టు మిగతా 2లో..



## స్కిల్ యూనివర్సిటీకి అదానీ భారీ విరాళం

**- సీఎం రేవంత్‌కు రూ.100 కోట్లు అందించిన గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ**

హైదరాబాద్, (ప్రజా మంటలు):
తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి అదానీ గ్రూప్ భారీ విరాళం ప్రకటించింది. అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ శుక్రవారం హైదరాబాద్ లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి రూ.100 కోట్ల చెక్కును అందజేశారు.సీఎస్ శాంతి కుమారి, దానకిశ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.యువతకు నైపుణ్యాలు నేర్పించేలా రంగారెడ్డి జిల్లాలో ముచ్చర్లలోని బేగరికంచెలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి ఈ వర్సిటీకి శంకుస్థాపన చేశారు. 17 రకాల కోర్సుల్లో యువతకు శిక్షణ ఇచ్చి ప్రైవేటు సంస్థల్లో ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు. ఏటా లక్షమందికి శిక్షణ ఇచ్చేలా రాబోయే కాలంలో ఈ వర్సిటీని విస్తరించ నున్నారు. బేగరికంచెలో సొంత భవనం పూర్తయ్యే వరకు గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా భవనంలో వర్సిటీ కార్యకలాపాలు కొనసాగనున్నాయి. ఈ ఏడాది నుంచే ప్రవేశాలు కల్పించే ఉద్దేశంతో ఇప్పటికే దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. నవంబరు 4వ తేదీ నుంచి స్కిల్ యూనివర్సిటీలో కోర్సులు ప్రారంభం కానున్నాయి.



## గ్రూప్-1 మెయిన్స్‌కు మార్గం సుగమం

సింగిల్ బెంచ్ తీర్పును సమర్థించిన డివిజన్ బెంచ్

ఈనెల 21 నుంచి 27వ తేదీ వరకు పరీక్షలు యథాతథం

46 కేంద్రాల్లో మెయిన్స్ పరీక్షలు

హాజరుకానున్న 33,383 మంది అభ్యర్థులు

హైదరాబాద్, (ప్రజా మంటలు):
తెలంగాణ గ్రూప్ 1 పరీక్ష రాసే అభ్యర్థులకు రాష్ట్ర హైకోర్టు బిగ్ షాక్ ఇచ్చింది . గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షకు హైకోర్టు డివిజన్ బెంచ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పరీక్షలు వాయిదా వేయాలన్న గ్రూప్ - 1 అభ్యర్థుల రిట్ అప్పీల్‌ను హైకోర్టు డివిజన్ బెంచ్ కొట్టేసింది. సింగిల్ బెంచ్ తీర్పును డివిజన్ బెంచ్ సమర్థించింది. దీంతో ఈ నెల 21వ తేదీ నుంచి 27వ తేదీ వరకు గ్రూప్ - 1 మెయిన్స్ పరీక్షలు నిర్వహించ నున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 46 పరీక్షాలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. 31,383 మంది అభ్యర్థులు గ్రూప్ 1 పరీక్షకు హాజరు కానున్నారు. పరీక్షా కేంద్రాలకు 200 మీటర్ల దూరంలో ఆంక్షలు అధికారులు విధించారు. పరీక్షా కేంద్రాల వద్ద ఐదుగురికన్నా ఎక్కువ మంది గుమికూడరాదని హెచ్చరించారు. ఇదిలాఉంటే.. తెలంగాణ గ్రూప్ 1 అభ్యర్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. జీవో 29ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జీవో 29 వల్ల జరిగే నష్టాన్ని ప్రధాన న్యాయమూర్తికి తమ న్యాయవాది వివరించారని విద్యార్థులు చెప్పారు. సోమవారం రోజు మొదటి కేసుగా తీసుకొని విచారిస్తామని సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ ప్రకటిస్తూ విచారణను వాయిదా వేశారు.
జీవో 55నే అమలు చేయాలని విద్యార్థులంతా కోరినా.. సీఎం పెడచెవిన పెట్టారని గ్రూప్ 1 అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సుప్రీంకోర్టుతో మొట్టికాయలు కొట్టించుకోక ముందే ప్రభుత్వం దిగివచ్చి జీవో 29ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. హైడ్రా గురించి మాట్లాడుతున్న సీఎం.. జీవో 29 వల్ల నష్టపోయే విద్యార్థుల గురించి ఎందుకు స్పందించడం లేదని గ్రూప్ 1 అభ్యర్థులు నిలదీస్తున్నారు. హైదరాబాద్ అశోక్ నగర్‌లో ఇప్పటికే పోలీసులు దాడులు చేస్తున్నారని గ్రూప్ 1 అభ్యర్థులు వాపోయారు. గ్రూప్ 1 చదివే విద్యార్థులపై దాడులు చేస్తూ.. పోలీస్ స్టేషన్‌లో ఉంచి ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. కోర్టు తీర్పు వచ్చే వరకు గ్రూప్ 1 మెయిన్స్ రద్దు చేయాల్సిందేనని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు. తెలంగాణ 2.0 ఉద్యమాన్ని మళ్లీ చూస్తారంటూ రేవంత్ సర్కార్‌ను విద్యార్థులు హెచ్చరించారు.
జీవో 29 గ్రూప్ 1 విద్యార్థులకు శాపంగా మారిందన్నారు. సీఎం మొండిగా ఎందుకు వెళు _న్నారో చెప్పాలన్నారు. రాజ్యాంగాన్ని కాపాడాలని రాహుల్ గాంధీ చెప్తుంటే, రేవంత్ రెడ్డేమో ఆ స్ఫూర్తిని తుంగలో తొక్కేలా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2022లో కేసీఆర్ జీవో 55 తెచ్చారని.. గ్రూప్ 1 లో రిజర్వేషన్లు అమలు అయ్యేలా తీసుకొచ్చారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక జీవో 29 తీసుకొచ్చారని.. దీని వల్ల గ్రూప్ 1 అభ్యర్థులకు నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సుప్రీం కోర్టులో న్యాయం జరుగుతుందనే ఆశాభావం ఉందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అశోక్ నగర్ వచ్చి విద్యార్థులతో మాట్లాడి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.



## బాల్య వివాహాల నిరోధక చట్టాన్ని సమర్థవంతంగా అమలుచేయాలి

- సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టీకరణ
- పర్సనల్ లాతో సంబంధం లేకుండా దాన్ని అమలుపరచాలి
- వివాహాల కట్టడికి సుప్రీం మార్గదర్శకాలు

న్యూఢిల్లీ, (ప్రజా మంటలు):
బాల్య వివాహాల కట్టడికి సర్వోన్నత న్యాయస్థానం మార్గదర్శకాలను జారీ చేసింది. పర్సనల్ లాతో సంబంధం లేకుండా దాన్ని అమలుచేయాలని సూచించింది.దేశంలో బాల్య వివాహాల నిరోధక చట్టాన్ని సమర్థవంతంగా మిగతా 2లో..

## సుప్రీం చరిత్రలో మరో కొత్త అధ్యాయం

**కేసుల విచారణ లైవ్ స్ట్రీమింగ్‌కు యత్నం**

**ప్రత్యేక యాప్ ద్వారా వీక్షించేలా ఏర్పాట్లు**

న్యూఢిల్లీ, (ప్రజా మంటలు):
సుప్రీంకోర్టు చరితలో మరో కొత్త అధ్యాయం మొదలు కానుంది. ఇకపై సుప్రీంలో జరిగే అన్ని కేసుల విచారణను లైవ్ స్ట్రీమింగ్ చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇందుకోసం రూపొందించిన యాప్‌ను ప్రయోగాత్మకంగా పరీక్షించారు. ఈ క్రమంలో లోటుపాట్లను సవరించి త్వరలో అమలులోకి తీసుకురానున్నారు. ఇప్పటికే అంటే సరిగ్గా రెండేళ్ల క్రితం రాజ్యాంగ ధర్మాసనం కేసుల విచారణ ప్రత్యక్ష ప్రసారం ప్రారంభమైంది. యూట్యూబ్ వేదికగా వాటిని ప్రసారం చేస్తున్నారు. ప్రత్యక్ష ప్రసారంలో తొలి విచారణ 'సేన లబ సేన' కేసుపై జరిగింది. మహారాష్ట్ర శివసేన పార్టీలో శిందే వర్గం తిరుగుబాటు, ఠాక్రే నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం కూలిపోవడం వంటి పరిణామాలపై సుప్రీంకోర్టులో అనేక పిటిషన్లు దాఖలయ్యాయి. అయితే, భారత మాజీ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ఎన్.వి.రమణ పదవీ విరమణ రోజు.. ఆయన నేతృత్వంలోని ధర్మాసనం కార్యకలాపాలను దేశ ప్రజలంతా వీక్షించేలా ఏర్పాట్లు చేశా రు. సుప్రీంకోర్టు కార్యకలాపాలను ప్రత్యక్ష ప్రసారం చేయడం అదే తొలిసారి. ఆ తర్వాత రాజ్యాంగ ధర్మాసనం విచారణలను లైవ్ స్ట్రీమింగ్ చేయాలని రెండేళ్ల క్రితం నిర్ణయం తీసు కున్నారు. ఈ చారిత్రక నిర్ణయంతో పౌరసత్వ సవరణ చట్టం, ఆర్టికల్ 370 వంటి కీలక కేసులకు సంబంధించిన విచారణల వంటివాటిని దేశ ప్రజలంతా ప్రత్యక్షంగా వీక్షించారు.

## తెలంగాణ వర్సిటీలకు 9 మంది కొత్త వీసీల నియామకం

- ఓయూ వీసీగా ఎం కుమార్
- తెలుగువర్సిటీకి నిత్యానందరావు
- ఉత్తర్వులు జారీ చేసిన గవర్నర్

హైదరాబాద్, (ప్రజా మంటలు):
తెలంగాణలో పలు యూనివర్శిటీలకు కొత్త వైస్ చాన్సలర్స్ లను నియమిస్తూ శుక్రవారం రాష్ట్ర గవర్నర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఏడాది మార్చి 21తో విసిల పదవీకాలం ముగియడంతో ప్రస్తుతం అన్ని యూనివర్శిటీలకు ఇన్‌చార్జ్ విసిలుగా ఐఎఎస్‌లు వ్యవహరిస్తున్నారు. బాసర ట్రిపుల్ ఐటి, మహిళా యూనివర్శిటీ మినహా రాష్ట్ర వ్యాప్తంగా మిగిలిన 10 యూనివర్శిటీలకు తెలంగాణ ప్రభుత్వం గతంలో సెర్చ్ కమిటీలను నియమించింది. ఈ కమిటీలు దరఖాస్తులను పరిశీలించి ఒక్కో యూనివర్శిటీకి ముగ్గురి పేర్లను గవర్నర్‌కి సిఫారసు చేస్తాయి. పది విసి పోస్టులకు 312 మంది దరఖాస్తు చేసుకున్నారు. కొత్తగా నియమితులై విసిల్లో అనుభవం, కులాలను పరిగణనలోకి తీసుకున్నట్లు అర్థం అవుతోంది. ఇందులో పాలమూరు యూనివర్శిటీ విసిగా జి.ఎస్. శ్రీనివాస్, కాకతీయ యూనివర్శిటీ విసిగా ప్రతాప్ రెడ్డి, ఉస్మానియా యూనివర్శిటీ విసిగా ఎం. కుమార్, శాతవాహన వర్శిటీ విసిగా ఉమేష్ కుమార్ తెలుగు వర్సిటీ విసిగా నిత్యానందరావు, మహాత్మాగాంధీ




వర్శిటీ విసిగా అల్తాఫ్ హుస్సేన్, తెలంగాణ యూనివర్శిటీ విసిగా యాదగిరి రావు, జయశంకర్ వర్శిటీ విసిగా జానయ్య,శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ హార్టీకల్చర్ వర్శిటీ విసిగా రాజిరెడ్డిలు నియమితులయ్యారు. ప్రభుత్వ సూచనలతో గవర్నర్ జిష్ణుదేవ్ శర్మ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా.. తెలంగాణలో చాలా మిగతా 2లో..

## లెబనాన్‌కు భారత్ మానవతా సాయం



న్యూఢిల్లీ, (ప్రజా మంటలు):
ఇజ్రాయెల్ - హెజ్‌బొల్లా మధ్య భీకర దాడులతో నెలకొన్న సంక్షోభ పరిస్థితుల నేపథ్యంలో లెబనాన్‌కు భారత్ మానవతా సాయం అందించింది. సంక్షోభ పరిస్థితుల్లో అక్కడి ప్రజలను ఆదుకోవాలనే సంకల్పంతో వారికి అవసరమైన ఔషధాలను పంపించాలని నిర్ణయించింది.మొత్తం 33 టన్నుల వైద్య సామగ్రిని పంపుతున్నట్లు కేంద్ర విదేశాంగ శాఖ తెలిపింది. ఇందులో భాగంగా తొలి విడతలో 11 టన్నుల వైద్యసామాగ్రిని శుక్రవారం ప్రత్యేక విమానంలో పంపించినట్లు కేంద్ర విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ వెల్లడించారు. కార్డియోవాస్కులర్ ఔషధాలు, నాన్-స్టెరాయిడ్ యాంటీ ఇన్‌ఫ్లమేటరీ మందులు, యాంటీ బయాటిక్స్, అనస్థీసియాకు సంబంధించిన ఔషధాలను పంపినట్లు ఆయన 'ఎక్స్'లో పేర్కొన్నారు.

## ప్రజా నాడి




## హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి లో దారుణం...

## బాత్రూంలో పసికందు మృత దేహం...!

రోజుకో ఘటన చోటు చేసుకుంటున్న వైనం

ఆడపిల్ల అని అబార్షన్ చేసి పడేశారా?

ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా ?

పసికందు కు హాస్పటల్ కు సంబంధం లేదు...సూపరింటెండెంట్

రంగంలోకి దిగిన పోలీసులు..







హుజురాబాద్, అక్టోబర్18 (ప్రజామంటలు) :
రోజు రోజుకు సమాజంలో మానవత్వం మంట కలుస్తుంది. నవమాసాలు మోసిన ఓ కర్కశ తల్లి ఆడ శిశువని తెలిసి అబార్షన్ చేసుకొని బాత్రూం లో పడేసిందా..? లేక తల్లి కి తెలియకుండా బంధువుల అబార్షన్ చేసి పడేసారా అంతుచిక్కని ప్రశ్న గా మారింది... హుజురాబాద్ ఏరియా ఆసుపత్రిలో మొన్న గర్భిణీల ప్రసవ వేదన విషయం మరవకముందే.. మళ్లీ గురువారం రాత్రి ఓ ఘోరం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే హుజురాబాద్ పట్టణంలో ని ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం రాత్రి ఆస్పత్రిలోని ఎమర్జెన్సీ వార్డులోని బాత్రూంలో మృత శిశు లభ్యం కావడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మృతశిశువుకు బోడ్డు తాడు కూడా కట్ చేయకుండా పడేశారు. ఆస్పత్రిలోనే డెలివరీ అయిన మహిళ బాత్రూంలో వేశారా..? లేదా బయట వ్యక్తులు ఎవరైనా మృత శిశువును తీసుకొచ్చి బాత్రూంలో వేశారా..? అనేది తెలియాల్సి ఉంది... ఈ విషయం తెలియగానే దీనిపై ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజేందర్ రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఘటన స్థలానికి పోలీసులు చేరుకుని సంఘటన స్థలాన్ని పరిశీలించి సిసి ఫుటేజీల ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈ విషయమై సూపరింటెండెంట్ రాజేందర్ రెడ్డిని వివరణ కోరగా మృత శిశువుకు ఎనిమిది నెలల వయసు ఉంటుందని అన్నారు. తమ ఆస్పత్రిలో డెలివరీ అయిన ప్రతి మహిళ, శిశువుల రికార్డు ఉంటుందని, ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బందిని బద్నాం చేసేందుకు బయట వ్యక్తులే మృత శిశువును తీసుకొచ్చి ఎమర్జెన్సీ వార్డులోని బాత్రూంలో వేసిఉంటారని తెలిపారు... ఏది ఏమైనప్పటికి ప్రతిదీ కూడా ఆస్పత్రిలోని సీసీ కెమెరాలల్లో కనిపిస్తుందని, సీసీ కెమెరాల ఆధారంగా పోలీసులు సమగ్ర విచారణ జరిపితే వెంటనే అసలు విషయం వెలుగులోకి వచ్చే అవకాశం ఉందిని స్థానికులు చర్చిస్తున్నారు.

## పొలిట్రిక్స్

విద్యా వైద్యం పై
చిన్నచూపు ఏల ?
ఉపాధి అంశం
అటక మీద జోల !
వాళ్లకు కాళేశ్వరం
తమకు మూసీనది ,
తేడా ఏముందట
ప్రజలకు అదే రంది !

- న్యాలకంటి నారాయణ
9346200066

మొదటి పేజీ తరువాయి



## గ్రూప్-1 మెయిన్స్‌కు మార్గం సుగమం

సింగిల్ బెంచ్ తీర్పును సమర్థించిన డివిజన్ బెంచ్
ఈనెల 21 నుంచి 27వ తేదీ వరకు పరీక్షలు యథాతథం
46 కేంద్రాల్లో మెయిన్స్ పరీక్షలు
హాజరుకానున్న 33,383 మంది అభ్యర్థులు

సోమవారానికి వాయిదా వేసింది. దివ్యాంగుల రిజర్వేషన్లకు సంబంధించి 2022లో జారీ చేసిన జీవో 55కు సవరణ తీసుకొస్తూ ఫిబ్రవరి 8న జారీ చేసిన జీవో 29ని రద్దు చేయాలని గ్రూప్-1 అభ్యర్థులు కోరుతున్నారు. జనరల్ కేటగిరీలోని అభ్యర్థుల కంటే ఎక్కువ మార్కులు సాధించిన వారిని అన్‌రిజర్వుడుగానే పరిగణిస్తుండటం వల్ల దివ్యాంగ అభ్యర్థులకు అన్యాయం జరుగుతోందన్నారు. వారికంటే ఎక్కువ మార్కులు వచ్చినా.. రిజర్వేషన్ కేటగిరీగానే పరిగణించి 1:50 కింద అభ్యర్థులను మెయిన్స్‌కు పిలవాలని కోరుతున్నారు. దివ్యాంగుల రిజర్వేషన్లకు సంబంధించిన వివాదం నేపథ్యంలో గ్రూప్-1 పరీక్షల నిలిపివేయాలని కొందరు అభ్యర్థులు కోరగా.. హైకోర్టు నిరాకరించింది. నోటిఫికేషన్ రద్దు చేయాలన్న అభ్యర్థనను తిరస్కరించిన ఉన్నత న్యాయస్థానం.. నియామకాలు తుది తీర్పునకు లోబడి ఉంటాయని విచారణ వాయిదా వేసింది. ఈ నేపథ్యంలో గ్రూప్ -1 అభ్యర్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

## తెలంగాణ వర్సిటీలకు 9 మంది కొత్త వీసీల నియామకం

కాలంగా వీసీల పోస్టులు ఖాళీగా ఉన్న విషయం తెలిసిందే. దాదాపు ఏడాదిన్నర కాలంగా వీసీలు లేకుండా పోయారు. అంతేకాదు ఇన్‌చార్జ్ వీసీలుగా సీనియర్ ఐఏఎస్‌లను నియమించినప్పటికీ వర్సిటీలో పరిస్థితి ఏమాత్రం మారలేదు. వీసీలు లేక అనేక యూనివర్సిటీల్లో పాలన గాడి తప్పినట్లైంది. పలు వర్సిటీల్లో అక్రమాలు జరిగాయని కూడా ఆరోపణలు వచ్చాయి. సరైన వసతులు లేక అనేకసార్లు విద్యార్థులు ఆందోళనబాట పట్టిన విషయం తెలిసిందే. తమ సమస్యలు పరిష్కరించాలని కొత్త వీసీలను నియమించాలని విద్యార్థులు పట్టుబట్టినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. వసతి గృహాల్లో పరిస్థితి మరీ అధ్వాన్నంగా మారింది. హాస్టల్స్‌లో సరైన భోజన సదుపాయం లేక, నాణ్యమైన ఆహారం లేక విద్యార్థులు అవస్థలు పడ్డ సందర్భాలు ఎన్నో. అంతేకాకుండా హాస్టల్స్‌లో విషపు పురుగులు తిరుగుతుండటంతో విద్యార్థులు మరింత భయాందోళనకు గురైన పరిస్థితులు ఉన్నాయి. అలాగే వీసీ పోస్టుల కోసం అనేక మంది ప్రొఫెసర్లు పైరవీలు చేసినట్లు సమాచారం. చివరకు ఎట్టకేలకు వీసీల నియామకంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తొమ్మిది యూనివర్సిటీలకు వీసీలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కొత్త వీసీల ఆధ్వర్యంలో యూనివర్సిటీల్లో పరిస్థితి మారుతుందని ప్రభుత్వం ఆశిస్తోంది.

కొత్తగా నియమితులైన వీసీలు వీరే...
పాలమూరు యూనివర్సిటీ- జి.ఎన్.శ్రీనివాస్
కాకతీయ యూనివర్సిటీ- ప్రతాప్‌రెడ్డి
ఓయూ - ఎం. కుమార్
శాతవాహన వర్సిటీ: ఉమేశ్ కుమార్
తెలుగు వర్సిటీ - నిత్యానందరావు
మహాత్మాగాంధీ వర్సిటీ- అల్తాఫ్ హుస్సేన్
తెలంగాణ యూనివర్సిటీ - యాదగిరిరావు
జయశంకర్ వర్సిటీ - జానయ్య
శ్రీకొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ హార్టికల్చర్ వర్సిటీ- రాజిరెడ్డి

## బాల్య వివాహాల నిరోధక చట్టాన్ని సమర్థవంతంగా అమలుచేయాలి

అమలుచేయాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. ఇందుకుగాను కొన్ని మార్గదర్శకాలను సైతం జారీ చేసింది. బాల్య వివాహాల నిరోధక చట్టాన్ని పర్సనల్ లాతో తగ్గించవద్దని వెల్లడించింది. అలాగే ఇలాంటి వివాహాలతో మైనర్లకు వారి జీవితాన్ని ఎంచుకొనే స్వేచ్ఛను ఉల్లంఘించడమేనని వ్యాఖ్యానించింది. బాల్యవివాహాల నిరోధం, మైనర్ల రక్షణపై అధికారులు దృష్టిసారించాలని, చివరి ప్రయత్నంగా నిందితులకు జరిమానా విధించాలని తెలిపింది.'బాల్యవివాహాలను నివారించాలనే వ్యూహాలు వివిధ వర్గాలకు అనుగుణంగా ఉండాలి. బహుళ రంగాల మధ్య సమన్వయం ఉన్నప్పుడే చట్టం విజయవంతం అవుతుంది. పోలీసులు, దర్యాప్తు అధికారులకు దీనిపై శిక్షణ సామర్థ్యాన్ని పెంచాలి. కమ్యూనిటీ ఆధారిత విధానాలు ఉండాలి' అని ధర్మాసనం పేర్కొంది. బాల్య వివాహాల నిరోధక చట్టాన్ని 2006లో రూపొందించారు. ఈ చట్టాన్ని 1929 నాటి బాల్య వివాహ నిరోధక చట్టం స్థానంలో తీసుకొచ్చారు.

## మూసీ సుందరీకరణకు వ్యతిరేకం కాదు

• కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



హైదరాబాద్, (ప్రజా మంటలు):
డ్రైనేజీ సమస్య పరిష్కారం కాకుండా మూసీ సుందరీకరణ జరగదని కేంద్రమంత్రి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. తెలంగాణలోని 30 శాతం జనాభా హైదరాబాద్‌లోనే ఉందన్నారు. మూసీ సుందరీకరణను ఎవరూ వ్యతిరేకించడం లేదని స్పష్టంచేశారు. ఇప్పుడున్న మూసీకి రెండువైపులా రిటైనింగ్ వాల్‌ను నిర్మించి అభివృద్ధి చేయవచ్చని సూచించారు. 30 ఏళ్ల క్రితం నిర్మించుకున్న పేదల ఇళ్లను కూల్చవద్దని మాత్రమే డిమాండ్ చేస్తున్నామని చెప్పారు. ముషీరాబాద్ నియోజకవర్గంలోని గాంధీనగర్ డివిజన్ ఆంధ్రాకేఫ్ ఎక్స్ రోడ్‌లో స్థానిక ఎమ్మెల్యే గోపాల్‌తో కలిపి సేవరేజ్ లైన్‌ను కిషన్ రెడ్డి ప్రారంభించారు.'మూసీ సుందరీకరణ పనులు చేయండి.. మూసీ పక్కన ముఖ్యమంత్రి ఇల్లు కట్టండి' మాకేమీ అభ్యంతరం లేదని ఎద్దేవా చేశారు. కష్టపడి నిర్మించుకున్న ఇళ్లను కూల్చివేసి డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇస్తాం.. రూ.25వేలు ఇస్తాం.. ఖాళీ చేయమనడం న్యాయం కాదని హితవు పలికారు. స్థానిక ప్రజలకు ఏ ఇబ్బంది లేకుండా మూసీ సుందరీకరణ పనులు చేయవచ్చని సూచించారు.

## నిరుద్యోగుల గురించి మాట్లాడే హక్కు భారాసకు లేదు

- బండి సంజయ్




కరీంనగర్ (ప్రజా మంటలు):
తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 29 వల్ల గ్రూప్-1 అభ్యర్థులకు నష్టం జరుగుతుందని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. ఇది ప్రభుత్వ అనాలోచిత నిర్ణయమేనని విమర్శించారు. ఆందోళన చేస్తున్న అభ్యర్థులపై లాఠీఛార్జ్ చేస్తున్నారని దుయ్యబట్టారు. 15వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చి.. 60వేల ఉద్యోగాలు భర్తీ చేస్తామంటున్నారని, గత ప్రభుత్వానికి, ఈ ప్రభుత్వానికి ఏం తేడా లేదని విమర్శించారు. కరీంనగర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో బండి సంజయ్ మాట్లాడారు. 'కేసీఆర్ ఆలోచనా విధానాలకు అనుగుణంగానే ఈ ప్రభుత్వం నడుస్తోంది. ఈ ప్రభుత్వానికి ఉద్యోగాలు భర్తీ చేసే ఆలోచన లేదు. ప్రణాళిక ప్రకారమే జీవో 29 ఇచ్చారు. నిరుద్యోగుల ఉసురు తగిలే భారాస ఓడిపోయింది. నిరుద్యోగుల గురించి మాట్లాడే అర్హత ఆ పార్టీకి లేదు. ప్రశ్న పత్రాలు లీకేజీ చేసి నిరుద్యోగుల భవిష్యత్‌ను భారాస నాశనం చేసింది" అని బండి సంజయ్ మండిపడ్డారు.

# పాలన చేతకాని కాంగ్రెస్ ప్రభుత్వం

### మూసీ చుట్టూ ముఖ్యమంత్రి ప్రదక్షిణం

### ట్విట్టర్ వేదికగా కెటిఆర్ విమర్శలు




హైదరాబాద్, (ప్రజా మంటలు):
తెలంగాణ అభివృద్ధి, పాలన చేతకాకే కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి మూసీ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. పాలన చేతకాకే పనికిమాలిన మాటలు, పాగల్ పనులు చేస్తున్నారని ధ్వజమెత్తారు. తెలంగాణ రాష్ట్రంలో పాలన పిచ్చోడి చేతిలో రాయిలా మారిందని ఎద్దేవా చేశారు. ఈ మేరకు ట్విటర్ వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. ఆడలేక మద్దెల ఓడు అన్నట్లు పరిపాలన, అభివృద్ధి చేయడం తెలియక మూసీ మురుగులో కాంగ్రెస్ పార్టీ పొర్లుతోందని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఆ పార్టీ నేతలు తమకు అంటిన మూసీ బురదను అందరికీ అందించాలని చూస్తున్నారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మూసీ ప్రాజెక్టుతోనే హైదరాబాద్ అభివృద్ధి అవుతుందని చెప్పే తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తెలుసుకోవాల్సింది చాలా ఉంది. మూసీ ప్రాజెక్టుతో సంబంధం లేకుండానే తలసరి ఆదాయంలో (పర్ క్యాపిటా) తెలంగాణ దేశంలోనే నంబర్ వన్ అయ్యింది. మూసీ ప్రాజెక్టులో రూ. 1.50 లక్షల కోట్లు దోచుకోకుండానే జీడీపీ అభివృద్ధిలో రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానం సాధించింది. బిల్డర్లు, రియల్టర్లను బెదిరించకుండానే ఐటీ ఎగుమతుల్లో బెంగళూరును హైదరాబాద్ దాటేసింది. మీ బడే భాయ్ మోదీ ఐటీఐఆర్ ని రద్దు చేసినా, తెలంగాణకు ఒక్క రూపాయి సహాయం చేయకపోయినా, ఐటీ ఎగుమతుల విషయంలో 2035 నాటికి చేరుకోవాల్సిన టార్గెట్‌ని 11 ఏళ్ల ముందేగానే 2023లో చేర్చిన ఘనత కేసీఆర్ నాయకత్వానిది. ఢిల్లీకి డబ్బు సంచులు పంపకుండానే తెలంగాణ విత్తన భాండాగారమైంది. దేశంలోనే ధాన్య సిరిగా మారింది. పేదల కంట కన్నీరు లేకుండానే పారిస్, బొగొటా, మెక్సికో సిటీ, మోంటేరియల్‌ను అధిగమించి ప్రపంచంలోనే అత్యుత్తమ గ్రీన్ సిటీ అవార్డును హైదరాబాద్ దక్కించుకుంది. మూసీ నదికి అటు ఇటు అభివృద్ధి, ఆకాశ హర్మ్యాలు కడుతున్నప్పుడు మరి ఫోర్త్ సిటీ ఎందుకు?. మూసీ పక్కన పెట్టుబడి పెట్టేందుకు ఫోర్ బ్రదర్స్ మనీ స్పిన్నింగ్ కోసమా?. ఫ్యూచర్ సిటీ అని పొంకణాలు ఎందుకు ?. కుర్చీలో కూర్చుంటేనో, సమావేశాల్లో తల కిందకీ మీదకీ తిప్పితేనో అభివృద్ధి జరగదు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నా అంటూ ప్రభుత్వ బడి పిల్లల పరువు తీయకు. కేసీఆర్ ప్రారంభించిన గురుకులాల్లో చదువుకున్న విద్యార్థులు అద్భుతమైన ఇంగ్లీష్ మాట్లాడతారు. ప్రపంచవ్యాప్తంగా గొప్ప గొప్ప ఉద్యోగాలు చేస్తున్నారు' అని కేటీఆర్ అన్నారు.

# మూసీపై చర్చకు సిద్ధం

## - మల్లన్నసాగర్ బాధితులకు మంచి ప్యాకేజీ ఇచ్చాం - హరీశ్ రావు

హైదరాబాద్, (ప్రజా మంటలు):
మూసీపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రంగా ఖండించారు. సీఎం రేవంత్ సిగ్గు లేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. శుక్రవారం మాజీ మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. 'రేవంత్ రెడ్డి సవాలుకు సిద్ధం. రేపు రమ్మంటావా.. ఎల్లుండి రమ్మంటావా. సెక్యూరిటీ లేకుండా వస్తా అన్నావ్. పోదాం పదా. డేట్, టైం మీరే చెప్పండి, కారు డ్రైవింగ్ చేసుకుంటూ ఇద్దరమే పోదాం. లేదంటే రేపు ఉదయం 9 గంటలకు నేను సిద్ధం. ముందు మూసీ నిర్వాసితుల వద్దకు, ఆ తర్వాత ఆర్‌అండ్‌ఆర్ కాలని, మల్లన్న సాగర్, రంగనాయక సాగర్ కట్ట మీదకు పోదాం అక్కడే కూర్చొని మాట్లాడుదాం' అంటూ మాజీ మంత్రి సవాల్ విసిరారు. 2013 చట్టానికి మించిన ప్రయోజనాలు మల్లన్న సాగర్ ప్రజలకు ఇచ్చింది బీఆర్ఎస్ పార్టీ అని చెప్పుకొచ్చారు. పేదల ఇళ్ళను కూల్చటాన్ని మాత్రమే బీఆర్ఎస్ వ్యతిరేకిస్తోందని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి కనీస అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిన్నటి సీఎం మాటలతో అబద్ధం కూడా ఆశ్చర్యపోయిందన్నారు. ప్రజల దృష్టిని మరల్చడం కోసమే సీఎం రేవంత్ మూసీ అంశాన్ని తీసుకొచ్చా రన్నారు. ఎన్నికల హామీలు నెరవేర్చటంలో కాంగ్రెస్ చతికిలపడిందని విమర్శించారు. నదీ జలాల శుద్ధితో మూసీ నది పునర్జీవ ప్రక్రియ మొదలు పెట్టాలన్నారు. మొదట మూసీ నదిలో వ్యర్థాలు వచ్చి చేరకుండా అడ్డుకోవాలని సూచించారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి స్థాయిని దిగజార్చారని మండిపడ్డారు. మూసీలో గోదావరి నీళ్ళను కలపటానికి డీపీఆర్ కూడా సిద్ధమైందని తెలిపారు. గుజరాత్‌లో కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా రాలేదన్నారు. మూసీ సుందరీకరణ ప్రాజెక్టు అంశంపై తెలంగాణ ముఖ్యమంత్రి కీలక కామెంట్స్ చేశారు. తెలంగాణ భవిష్యత్‌ను నిర్దేశిరచే ప్రాజెక్టును ప్రభుత్వం చేపట్టిందన్నారు. 33 బృందాలు మూసీ పరివాహకంపై అధ్యయనం చేశాయని సీఎం తెలిపారు. మూసీ పరివాహకంలో నివసిస్తున్న వారు దుర్భర పరిస్థితుల్లో ఉన్నారని.. అలాంటి వారికి మెరుగైన జీవితం అందించాలని భావిస్తున్నామన్నారు. విషవలయం లో పేదలు ఉండాలనేది కొందరి ఆలోచన అంటూ విపక్షాలపై పరోక్షంగా విమర్శలు గుప్పించారు సీఎం రేవంత్. భూగరిష్ట పరిమితి చట్టాన్ని వ్యతిరేకించిన వర్గం కూడా దేశంలో ఉండేదన్నారు. పేదలు ఎప్పుడూ పేదలుగానే ఉండాలని దొరలు, భూస్వాములు భావిస్తారన్నారు. కొందరు ప్రజా ప్రతినిధులు, అధికారులు రాష్ట్రాన్ని దోచుకున్నారని సీఎం ఆరోపించారు. తాము చేపడుతున్నది మూసీ సుందరీకరణ కాదని.. మూసీ నది పునరుజ్జీవన కార్యక్రమం అని చెప్పారాయన. కొందరి మెదడులో మూసీలో ఉన్న మురికి కంటే.. ఎక్కువ విషం నింపుకున్నారంటూ విపక్ష నేతలపై ఘాటైన వ్యాఖ్యలు చేశారు. విషపూరిత ఆలోచనలతోనే మూసీ ప్రాజెక్ట్‌పై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ఇదే సమయంలో ప్రతిపక్షాలకు సీఎం రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. మల్లన్నసాగర్, కొండపోచమ్మ, కిష్టాపూర్ ఎక్కడికైనా.. సెక్యూరిటీ లేకుండా తానువ స్తానని అన్నారు. విపక్ష నేతలు కూడా రావాలని సవాల్ విసిరారు. అక్కడ రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహిద్దామన్నారు. '

3 కాదు.. 4 నెలలు ఉంటా..

మూసీలో 99 శాతం మంది సుందరీకరణ వద్దంటున్నారని చెప్పారు. ఏ ప్రాజెక్ట్ చేపట్టాలన్నా ముందు డీపీఆర్ తయారు చేయాలి. పర్యావరణ అనుమతులు తీసుకోవాలి. ప్రజలు కష్టపడి కట్టుకున్న ఇండ్లను ప్రభుత్వం కబ్జా చేస్తున్నది. ఫార్మాసిటీని రద్దు చేయలేదని హైకోర్టులో చెప్పారు. ఫోర్త్ సిటీ ఎక్కడుంది.. ఎక్కడ కడుతారని ప్రశ్నించారు. నల్లగొండ ప్రజలను రెచ్చగొట్టాలని చూస్తున్నారు. నల్లగొండ ప్రజలపై ప్రేమ ఉంటే మూసీలోకి పారిశ్రామిక వ్యర్థాలు పోనివ్వొద్దు. హైదరాబాద్‌లో వరదలు వస్తాయని బెదిరిస్తున్నరు. 1908లో హైదరాబాద్‌లో వరదలు వచ్చినప్పుడు నిజాం చర్యలు చేపట్టారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య సూచన మేరకు జంట జలాశయాలు నిర్మించారు. మళ్లీ ఇంతవరకు అంతటి వరదలు రాలేదు. ఎక్కువ వరదలు వస్తాయంటే మూసీకి గైడ్ వాల్ కట్టాలి. పేదల ఇండ్లకు అభ్యంతరం ఉంటే మాల్ కట్టడానికి అభ్యంతరం ఉండదా. పేదల ఇండ్లు కూలగొట్టడానికి మేం వ్యతిరేకం. బ్యూటిఫికేషన్ పేరుమీద రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయొద్దు. మూసీ నది గర్భంలో ఉన్నవాళ్లకు 2013 పునరావాస చట్టం అమలు చేయాలి. గచ్చిబౌలిలో 450 ఎకరాలున్నాయి. అక్కడ ఇండ్లు ఇవ్వండి. మూసీ బఫర్ జోన్‌లో ఉన్న ఇండ్లను కూల్చొద్దు. 10 వేల కుటుంబాలకు మేలు జరుగుతుందంటే తాను వెళ్లి మూసీ బఫర్ జోన్‌లో మూడు పునరుజ్జీవనం పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారంసుందరీకరణ పేరుతో రేవంత్ పేదల ఇండ్లు కూలగొడుతున్నారు. మూసీ పునరుజ్జీవనం పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నరు. విష వ్యర్థాలు మూసీలోకి రాకుండా ఫార్మాసిటీ ప్రతిపాదించాం.



జనవాసాల్లోని కంపెనీలను తరలించే ఏర్పాట్లు చేశాం. ఫార్మా సిటీకి కేటాయించిన భూమిని కూడా రియల్ ఎస్టేట్‌కు మార్చుతున్నారు. శత్రు దేశాల మీదికి దాడికి వెళ్లినట్లు పేదల బస్తీలపై ప్రభుత్వం దాడి చేస్తున్నది. లక్షన్నర కోట్లతో మూసీ ప్రాజెక్టు చేపడతామని రేవంత్ చెప్పారు. ఇప్పుడు అలా ఎవడు చెప్పాడని దబాయిస్తున్నడు. మూసీపై రేవంత్ రెడ్డి రోజుకో మాట మాట్లాడుతున్నడు. మూసీ నుంచి మల్లన్నసాగర్, రంగనాయక సాగర్ వెళ్దామని రేవంత్ రెడ్డికి సవాల్ విసిరారు. తానే స్వయంగా కారు డ్రైవింగ్ చేస్తానని, రేవంత్ వస్తే తీసుకెళ్తానని చెప్పారు. ప్రజలు ఏమనుకుంటున్నారో చూద్దామన్నారు. మల్లన్నసాగర్ నిర్వాసితులకు దేశంలోనే బెస్ట్ ఆర్ అండ్ ఆర్ కాలనీ, రోడ్లు, విద్యుత్ సహా అన్ని సౌకర్యాలతో 250 గజాల స్థలంలో ఇండ్లు నిర్మించామన్నారు. 2013 భూసేకరణ చట్టానికి మించి నిర్వాసితులకు ఇచ్చామన్నారు. భూసేకరణ చట్టం మూసీ నిర్వాసితులకు ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. మల్లన్నసాగర్ నిర్వాసితులకు ఐదు రకాల ప్రయోజనాలు కల్పించామన్నారు. 250 గజాల్లో ఇండ్లు కట్టించామని, కుటుంబ యజమానికి రూ.7.5 లక్షలు, 18 ఏండ్లు నిండిన వారికి రూ.5 లక్షలు, 250 గజాల స్థలం ఇచ్చామన్నారు. మొత్తంగా మల్లన్నసాగర్, రంగనాయకసాగర్ నిర్వాసితులకు రూ.2 వేల కోట్లు ఇచ్చామని చెప్పారు. కేసీఆర్ కట్టించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను మూసీ నిర్వాసితులకు ఇస్తున్నారని విమర్శించారు.'మూసీ నది పునరుజ్జీవనమే తప్ప సుందరీకరణ కాదని ముఖ్యమంత్రి చెప్పాడు.. కానీ విదేశీ కంపెనీ ఇచ్చిన వీడియో చూస్తే మాత్రం న్యూయార్ టైం స్క్వేర్‌ను మించిన వెలుగు జిలుగులు, సిడ్నీ ఒపెరా హౌజ్‌ను తలదన్నే హైరైజ్ బిల్డింగులు, లండన్ లోని థేమ్స్ నది మీదున్న బ్రిడ్జిని మించిన బ్రిడ్జిలు చూపెట్టిండు. ప్రపంచ దేశాల్లో ఉన్న రివర్ ఫ్రంటులన్నీ ఒక్క దగ్గర వేసి దంచి నూరి ఏఐలో వేసి తీసినట్టున్నపంచవన్నెల దృశ్యాలను చూపించాడు. నది పునరుజ్జీవనం అంటే సజీవంగా గలగలపారే స్వచ్ఛమైన జలాలు.. అద్దాల బిల్డింగులు ఉండవంటూనే ఎన్నెన్నో అందాలను చూపించారు. ముఖ్యమంత్రి మాట కరెక్టా? కాంట్రాక్టు తీసుకున్న కంపెనీల చూపించిన వీడియో కరెక్టా?. మీ ప్రజెంటేషన్‌లో రివర్ రెజువనేషన్, రివర్ ఫ్రంట్ అని ఉంది.. రివర్ రెజునెవేషన్ అంటే నదీ పునరుజ్జీవనం. మరి ఈ రివర్ ఫ్రంట్ ఏంది.. దాని వెనుక దాగి ఉన్న స్టంట్ ఏంది?. రేవంత్.. నీది నోరా మోరా? మూసీ సుందరీకరణ కోసం రూ.లక్షా 50 వేలు ఖర్చుపెడతామని నీ నోటితో నువ్వే చెప్పి, ఇప్పుడు సిగ్గులేకుండా రోజుకో మాట మాట్లాడుతున్నవ్. శత్రుదేశాల మీద దాడికి పోయినట్టు.. రేవంత్ రెడ్డి పేదల ఇంటిమీద దాడి చేస్తున్నాడు. నిర్మాణాత్మకమైన పనితో పని ప్రారంభం కావాలి.. కానీ విధ్వంసంతో నువ్వు పని ప్రారంభం చేస్తున్నావు. రేవంత్ రెడ్డి గుర్రాలతో తొక్కించిన సంస్కృతి నీ కాంగ్రెస్ పార్టీది, నువ్వు గతంలో ఉన్న తెలుగు దేశం పార్టీది. ఆశ వర్కర్లను, అంగన్వాడీలను అసెంబ్లీ ముందు గుర్రాలతో తొక్కించిన చరిత్ర నీ కాంగ్రెస్ పార్టీది. పెంచిన కరెంట్ బిల్లులను తగ్గించమని చెప్పితే గుర్రాలతో తొక్కించిన ఘనత గతంలో నువ్వున్న టీడీపీ పార్టీది.' అని రేవంత్ రెడ్డిపై హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. తిమ్మిని బమ్మిని చేయబోయి సీఎం రేవంత్ రెడ్డి బొక్కబోర్లాపడ్డారని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. అబద్ధమే ఆశ్చర్యపడే విధంగా సీఎం రేవంత్ మాటలున్నాయని విమర్శించారు. తన రియల్ ఎస్టేట్ కలలను గ్రాఫిక్ హంగులతో చూపించారన్నారు. రివర్ రిజువనేషన్, రివర్ ఫ్రంట్ అని ప్రజెంటేషన్ ఇచ్చారు. రివర్ రెజునెవేషన్ అంటే నదీ పునరుజ్జీవనం. మరి ఈ రివర్ ఫ్రంట్ ఏందని ప్రశ్నించారు. దాని వెనుక దాగి ఉన్న స్టంట్ ఏందని నిలదీశారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రులు వేముల ప్రశాంత్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, కొప్పుల ఈశ్వర్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ హయాంలోనే మూసీ పునరుజ్జీవనం ప్రారంభించామన్నారు. రేవంత్ చూపించింది రివర్ ఫ్రంట్ అని చెప్పారు. రూ.3800 కోట్లతో కేసీఆర్ మూసీ పునరుజ్జీవన ప్రాజెక్ట్, గోదావరి జలాలను మూసీకి తేవడానికి రూ.1100 కోట్లతో ప్రాజెక్ట్ చేపట్టారని వెల్లడించారు. రేవంత్ రెడ్డి ఆ ప్రాజెక్టును మార్చి రూ.4 వేల కోట్లకు పెంచారని ఆరోపించారు.



# మా బందీలను విడిచిపెట్టండి

## - రేపే యుద్ధం ముగిస్తాం

## - నెతన్యాహు ప్రకటన

టెల్అవీవ్ (ప్రజా మంటలు):

గత ఏడాది అక్టోబరు 7 నాటి దాడుల సూత్రధారి.. హమాస్ మిలిటెంట్ గ్రూప్ అధినేత యహ్యా సిన్వర్‌ను ఇజ్రాయెల్ హతమార్చినట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈక్రమంలో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కీలక వ్యాఖ్యలు చేశారు. తమ బందీలను వదిలేస్తే రేపే యుద్ధం ముగిస్తామని పేర్కొన్నారు. గాజా పౌరులను ఉద్దేశిస్తూ నెతన్యాహు కీలక వ్యాఖ్యలు చేశారు. హమాస్ ఆయుధాలను వదిలి.. తమ బందీలను తిరిగి పంపిస్తే ఈ యుద్ధం రేపే ముగిస్తుందని పేర్కొన్నారు. అదేవిధంగా తమ పౌరులను వదిలిన హమాస్ తీవ్రవాదులకు బయటకు వచ్చి జీవించే అవకాశం కల్పిస్తామన్నారు. లేదంటే వేటాడి మరీ హతమరుస్తామని హెచ్చరించారు. ఇదిలా ఉండగా.. 'వేలాది మంది ఇజ్రాయెల్ పౌరులను హతమర్చిన హంతకుడు మరణించాడు. ఇది అతిపెద్ద విజయంగా నేను భావిస్తున్నా. ఇది గాజాతో యుద్ధం ముగింపు కాదు.. ఇప్పుడే ముగింపు దశ ప్రారంభమైంది' అని నెతన్యాహు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇజ్రాయెల్ దళాలను ఆయన ప్రశంసించారు. హమాస్ మిలిటెంట్ గ్రూప్ అధినేత సిన్వర్ మృతిపై అమెరికా ఉపాధ్యక్షురాలు కమలాహారిస్ స్పందించారు. సిన్వర్ మరణంతో న్యాయం జరిగిందని వ్యాఖ్యానించారు. అలాగే ఇది గాజాతో యుద్ధం ముగింపు పలికేందుకు మంచి అవకాశంగా భావిస్తున్నామన్నారు. 'ఇజ్రాయెల్ సురక్షితంగా ఉంటుంది. బందీలు విడుదలవడంతో పాటు గాజాలో బాధలు తొలగిపోతాయి' అని హారిస్ పేర్కొన్నారు. అక్టోబరు 7న ఇజ్రాయెల్‌పై మరణకాండకు యహ్యా సిన్వర్ సూత్రధారి. ఈ ఘటనలో 1,200 మంది ఇజ్రాయెల్ వాసులు చనిపోగా.. 250 మందిని హమాస్ మిలిటెంట్లు బందీలుగా తీసుకెళ్లారు. దీంతో సిన్వర్ జాడ తెలుసుకునేందుకు ఇజ్రాయెల్ తీవ్రంగా ప్రయత్నించింది. ఈక్రమంలో దక్షిణ గాజాలో బుధవారం ముగ్గురు హమాస్ మిలిటెంట్లను ఇజ్రాయెల్ హతమార్చింది. అందులో సిన్వర్ ఉన్నట్లు డీఎన్ఏ ద్వారా ధ్రువీకరించినట్లు ఇజ్రాయెల్ తెలిపింది. అయితే దీనిపై హమాస్ ఎటువంటి ప్రకటనా చేయలేదు.

# సిన్వార్ స్థానం భర్తీపై విస్తృత చర్చ

## - రేసులో పలువురి పేర్లు

గాజా (ప్రజా మంటలు):

ఇజ్రాయెల్‌తో పోరులో హమాస్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలిన విషయం తెలిసిందే. ఆ మిలిటెంట్ గ్రూప్ అధినేత యహ్యా సిన్వార్ ను ఐడీఎఫ్ మట్టుబెట్టింది. ఇప్పుడు ఆ మిలిటెంట్ గ్రూప్‌ను ముందుండి నడిపించేది వెరన్నదానిపై విస్తృతంగా చర్చ నడుస్తోంది । ఇజ్రాయెల్‌తో పోరులో హమాస్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలిన విషయం తెలిసిందే. గతేదాది అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్ జరిపిన దాడిలో ప్రధాన వ్యూహకర్తగా వ్యవహరించిన ఆ మిలిటెంట్ గ్రూప్ అధినేత యహ్యా సిన్వార్ ను ఐడీఎఫ్ మట్టుబెట్టింది. ఈ విషయాన్ని ఇజ్రాయెల్ ధ్రువీకరించింది. గాజాలోని రఫా పట్టణంపై ఐడీఎఫ్ ఈ నెల 7న చేసిన దాడిలో సిన్వార్ హతమైనట్లు ఇజ్రాయెల్ విదేశాంగ శాఖ మంత్రి కట్జ్ గురువారం నిర్ధారించారు. యహ్యా సిన్వార్.. హమాస్ మిలిటరీ విభాగంలో కీలక వ్యక్తిగా ఎదిగారు. ఐడీఎఫ్ దాడుల్లో సిన్వార్ మృతి చెందడం ఆ గ్రూప్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలినట్లైంది. ఇప్పుడు ఆ మిలిటెంట్ గ్రూప్‌ను ముందుండి నడిపించేది వెరన్నదానిపై విస్తృతంగా చర్చ నడుస్తోంది రేసులో పలువురు ఉన్నత స్థాయి నేతల పేర్లు కూడా వినిపిస్తున్నాయి. ఇందులో హమాస్ వ్యవస్థాపకుల్లో ఒకరైన మహమ్మద్ అల్ జహర్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఆయన హమాస్ గ్రూప్‌ను ముందుండి నడిపిస్తాడని వార్తలు వస్తున్నాయి. అదే సమయంలో సిన్వార్ సోదరుడు మహమ్మద్ సిన్వార్ పేరు సైతం ప్రచారంలో ఉంది. హమాస్ పొలిటికల్ బ్యూరో సీనియర్ సభ్యుడు మౌసా అబు మార్జౌక్, హమాస్ మిలిటరీ వింగ్ కమాండర్ మొహమ్మద్ దీఫ్, హమాస్ పొలిటికల్ బ్యూరో ఖలీల్ అల్ హయ్యా, ఖలేద్ మషాల్ సహా పలువురి పేర్లు ప్రచారంలో ఉన్నాయి. 1962లో జన్మించిన సిన్వార్ గాజాలోని ఇస్లామిక్ యూనివర్సిటీ ఆందోళనల్లో పాల్గొనడంతో ఇజ్రాయెల్ 1980లో అరెస్ట్ చేసింది. గ్రాడ్యుయేషన్ పూర్తయిన తర్వాత ఇజ్రాయెల్‌పై పోరాటానికి ఆయుధాల ప్రయోగంలో శిక్షణ పొందిన వారిని నియమించి ఒక సంస్థను స్థాపించాడు. కాసమ్ బ్రిగేడ్స్‌గా పేరొందిన ఆ గ్రూప్ తర్వాత హమాస్ మిలటరీ వింగ్‌గా మారింది. అనంతరం అతడిని అరెస్ట్ చేసిన ఇజ్రాయెల్ 426 ఏండ్ల జైలు శిక్ష విధించింది. 23 ఏండ్లు అతను ఇజ్రాయెల్ జైలులో గడిపాడు. 2011లో ఖైదీల ఒప్పందంతో విడుదలయ్యాడు. 2014లో హమాస్‌లో ప్రధాన నేతగా ఎదిగాడు. గత ఏడాది అక్టోబర్ 7 దాడిలో ప్రధాన పాత్ర పోషించాడు. గత ఏడాది అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్ జరిపిన దాడిలో సిన్వార్ ప్రధాన వ్యూహకర్తగా వ్యవహరించారు. అప్పటి నుంచి ఇజ్రాయెల్ వాంటెడ్ లిస్టులో ఉన్న సిన్వార్ జాడను కనిపెట్టడం ఇజ్రాయెల్‌కు కష్టతరంగా మారింది. గాజాలో నిర్మించిన సొరంగాల్లో ఆయన ఎక్కువగా ఉండేవారు. ఇదే క్రమంలో అప్పటివరకు హమాస్ చీఫ్‌గా ఉన్న ఇస్మాయిల్ హనియా ఇరాన్‌లోని టెహ్రాన్‌లో ఉండగా, ఆగస్టులో ఇజ్రాయెల్ మట్టుబెట్టడంతో ఆయన స్థానాన్ని సిన్వార్ స్వీకరించారు.

# ఆత్మహత్యకకు పాల్పడ్డ ప్రేమ జంట

గుంటూరు, అక్టోబర్18 (ప్రజా మంటలు):

గుంటూరు జిల్లాలో ప్రేమజంట బలవన్మరణానికి పాల్పడింది. యువతి, యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. పెదకాకాని వద్ద శుక్రవారం తెల్లవారుజామున ఈ ఘటన చోటుచేసుకుంది. మృతులను దానబోయిన మహేశ్(22), నంద్రు శైలజ(21)గా గుర్తించారు. వివరాల్లోకి వెళ్తే.. పెదకాకాని గ్రామానికి చెందిన మహేశ్, నందిగామ మండలం రుద్రవరానికి చెందిన శైలు గత కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. డిప్లొమా చదివిన మహేశ్.. రెండేళ్ల క్రితం హైదరాబాద్‌లో ఓ మొబైల్ స్టోర్‌లో పని చేశాడు. ఆ సమయంలో అక్కడే ఉన్న శైలజతో పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. ఇటీవలే ప్రేమ విషయం ఇరు కుటుంబాలకు తెలిసింది. 10 రోజుల క్రితం యువకుడి తల్లిదండ్రులు పెళ్లికి అంగీకరించారు. యువతి కుటుంబసభ్యులు అభ్యంతరం తెలిపినట్లు సమాచారం. దసరా సమయంలో శైలు, మహేశ్ ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లిపోయారు. దీంతో యువతి కుటుంబ సభ్యులు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో శుక్రవారం పెదకాకాని సమీపంలో రైల్వే ట్రాక్‌పై విగత జీవులుగా కనిపించారు.

# మాజీ మంత్రి బంధువులపై కేసు

## మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో నమోదు

## బిల్డింగ్ ఆక్రమించారని వ్యక్తి ఫిర్యాదు

హైదరాబాద్,అక్టోబర్18(ప్రజా మంటలు):

మాజీ మంత్రి బంధువులపై మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. తమ ప్రాపర్టీలో మాజీ మంత్రి బంధువులు అక్రమంగా వచ్చి ఉంటున్నారంటూ బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మాజీ మంత్రి బంధువులపై మియాపూర్‌లో ట్రెస్‌పాస్, చీటింగ్ కేసు నమోదు అయ్యింది. దండు లచ్చిరాజు అనే వ్యక్తికి మియాపూర్‌లో ఐదు అంతస్థుల ప్రాపర్టీ ఉంది. అయితే మాజీ మంత్రి బంధువులు అక్రమంగా ఆక్రమించుకుని అక్కడే ఉంటున్నారని సదరు బాధితుడు వాపోయాడు. తన్నీరు గౌతం, బోయినపల్లి వెంకటేశ్వర రావు, గోని రాజకుమార్ గౌడ్, గారపాటి నాగరవి, జంపన ప్రభావతి, తన్నీరు పద్మజారావు తన ప్రాపర్టీని ఆక్రమించారని బాధితుడు దండులచ్చిరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఫాస్మో హాస్పిటాలిటీ సర్వీసెస్ పేరుతో ప్రామిసరీ నోటు తీసుకుని చీటింగ్‌కు పాల్పడ్డారని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. బ్లాంక్ చెక్, బ్లాంక్ ప్రామిసరీనోటు తీసుకుని మరీ మాజీ మంత్రి బంధువులు చీటింగ్‌కు పాల్పడ్డారని.. తనకు తెలియకుండానే తన ఇంటిని అమ్మేశారని ఫిర్యాదు చేశారు. జంపన ప్రభావతి మీద లచ్చిరాజు ఆరోపణలు గుప్పించారు. తనకు వ్యతిరేకంగా ఇంజంక్షన్ ఆర్డర్ తెచ్చారని ఆరోపించారు. ఈ విషయంపై 2019 నుంచి లచ్చిరాజు పోరాడుతున్నట్లు తెలుస్తోంది. కేసు నమోదు అయిన వాళ్లు మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావుగా సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# గ్రూప్ -4 ఉద్యోగ అభ్యర్థులు ఆందోళన

## అన్ లివింగ్ ఆప్షన్ ఇవ్వాలని డిమాండ్

హైదరాబాద్, (ప్రజా మంటలు):

గాంధీ భవన్ వద్ద గ్రూప్ -4 ఉద్యోగ అభ్యర్థులు శుక్రవారం ఉదయం ఆందోళనకు దిగారు. కొందరు గ్రూప్ -2, గ్రూప్ -1 మెయిన్‌కు ఎంపిక అయిన వారిని గ్రూప్ 4 నుంచి వెంటనే అన్ లివింగ్ చేయాలని డిమాండ్ చేశారు. పెద్ద పోస్టులలో ఉన్న వారు అన్ లివింగ్ ఆప్షన్ ఇవ్వాలన్నారు. వారి పోస్టులు వచ్చి వెళ్లిన తర్వాత బ్యాక్ లాగ్‌లుగా ఉంచవద్దని.. దీని వల్ల వెనకున్న అభ్యర్థులు నష్టపోతారని వాపోయారు. రెండు వేల పోస్టులు ఖాళీ అయ్యే అవకాశం ఉందని.. వెంటనే ప్రభుత్వం స్పందించాలని గ్రూప్ -4 అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు. గ్రూప్ -1 అభ్యర్థుల ఆందోళనతో గాంధీభవన్ వద్ద కాసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని వారిని నచ్చజెప్పేందుకు ప్రయత్నిస్తున్నారు. కాగా.. గ్రూప్ -1 మెయిన్స్ పరీక్షకు లైన్ క్లియర్ అయిన విషయం తెలిసిందే. గ్రూప్ 1 ప్రిలిమ్స్ పిటిషన్లను హైకోర్టు డిస్మిస్ చేసింది. వివిధ కారణాలతో గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్షలపై హైకోర్టులో (÷స్గ÷జీనిణజీనిజీ ఊతిణర అనీబీసబి) అభ్యర్థులు పలు పిటిషన్లు దాఖలు చేశారు. మంగళవారం ఉదయం ఈ పిటిషన్లపై హైకోర్టులో విచారణకు వచ్చింది. గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్షలపై దాఖలైన రెండు పిటిషన్లను హైకోర్టు కొట్టివేసింది. గ్రూప్ 1లో తప్పుడు ప్రశ్నలను తొలగించాలని ఒక పిటిషన్ దాఖలవగా.. ప్రిలిమినరీ కీ లో తప్పులు ఉన్నాయని, కీ ని రీ నోటిఫికేషన్ చేయాలని మరో పిటిషన్‌ను అభ్యర్థులు దాఖలు చేశారు. తప్పుడు ప్రశ్నలు తొలగించి మళ్లీ మెరిట్ జాబితాను విడుదల చేయాలని పిటిషనర్లు కోరారు. ఈ పిటిషన్లపై ఈరోజు హైకోర్టులో విచారణ జరిగింది. త్వరలో గ్రూప్ వన్ మెయిన్స్ పరీక్షలు జరగబోతున్నాయని ఈ సమయంలో న్యాయస్థానం జోక్యం చేసుకుంటే మెయిన్స్ విద్యార్థులు నష్టపోతారని టీజీపీఎస్సీ కోర్టుకు తెలియజేసింది. ప్రభుత్వ వాదనలతో ఏకీభవించిన హైకోర్టు పిటిషన్‌లను కొట్టివేసింది. దీంతో ఈనెల 21 నుంచి గ్రూప్ -1 మెయిన్స్ పరీక్షలు యథావిధిగా జరుగనున్నాయి. మరోవైపు గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లు అందుబాటులోకి వచ్చాయి. తెలంగాణ పబ్లిక్ సర్వీసు కమిషన్ వెబ్‌సైట్ నుంచి అభ్యర్థులు ఈ హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ నెల 21 నుంచి 27వరకు గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు జరగనున్న విషయం తెలిసిందే. ప్రిలిమినరీ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులు మెయిన్స్ పరీక్షలు రాయనున్నారు. ఈ పరీక్షలను హెచ్ఎండీఏ పరిధిలో నిర్వహిస్తున్నారు. హాల్‌టికెట్లు పరీక్ష ప్రారంభమయ్యే ఒక రోజు ముందు వరకు అందుబాటులో ఉంటాయని అధికారులు వెల్లడించారు. మెయిన్స్ పరీక్షలు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరగనున్నాయి. అభ్యర్థులు పరీక్ష ప్రారంభానికి కనీసం 30 నిమిషాల ముందుగా పరీక్ష హాల్‌లోకి చేరుకోవాల్సి ఉంటుంది. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 1.30 గంటల వరకు అభ్యర్థులను అనుమతించనున్నట్టు అధికారులు వెల్లడించారు. ఆ తర్వాత వచ్చే వారిని అనుమతించబోమని స్పష్టంచేశారు.



# రాష్ట్రంలో మరోసారి భారీగా వర్షాలు

## విశాఖ ,కాకినాడల్లో ఎడతెరిపిలేని వానలు

విజయవాడ,అక్టోబర్18(ప్రజా మంటలు):

రాష్ట్రంలో మరోసారి భారీగా వర్షాలు కురుస్తున్నాయి. విశాఖపట్నం, కాకినాడలో ఎడతెరపిలేకుండా వర్షాలు పడుతున్నాయి. దీంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. విశాఖ ఆర్కేబీచ్, కాకినాడ తీరాల్లో పెద్ద ఎత్తున అలలు ఎగిసిపడటంతో ప్రజలు తీవ్ర భయభ్రాంతులకు గురయ్యారు. కాకినాడ ఉప్పాడ వద్ద సముద్రం అల్లకల్లోలంగా మారిపోయింది. శుక్రవారం కూడా కాకినాడ నగరంలో కుండపోత వర్షం కురిసింది. రెండు గంటల నుంచి ఏకధాటిగా వాన కురుస్తోంది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. భారీ వర్షం నేపథ్యంలో కాకినాడ పోర్టు నుంచి బియ్యం ఎగుమతులకు బ్రేక్ పడింది. బార్జీల నుంచి నౌకలకు బియ్యం రవాణా నిలిపివేశారు అధికారులు. అటు ప్రకాశం జిల్లా మార్కాపురం, తర్లుపాడు, పెద్దారవీడు మండలాల్లో వేకువజాము నుంచి భారీ వర్షం కురుస్తోంది. మార్కాపురం మండలం బొడిచర్ల వద్ద గుండ్లకమ్మ వాగు ఉప్పొంగి ప్రవహిస్తోంది. తర్లుపాడు - మార్కాపురం మధ్య కొండ వాగు ప్రవహిస్తోంది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మరోవైపు ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులు నిండుకుండలా మారాయి. తుంగభద్ర జలాశయం, శ్రీశైలం జలాశయానికి భారీగా ఇన్ఎ÷-లో వచ్చి చేరుతోంది. దీంతో అధికారులు ప్రాజెక్టుల గేట్లు ఎత్తివేసి నీటిని దిగువకు విడదల చేస్తున్నారు. తుంగభద్ర జలాశయం నుంచి 10 గేట్ల ద్వారా నీటిని అధికారులు విడుదల చేశారు. పూర్తి స్థాయి నీటి మట్టం1633 అడుగులు కాగా.. ప్రస్తుతం నీటి మట్టం 1631.93 అడుగులకు చేరింది. అలాగే ఇన్ ఎ÷-లో 50,593 క్యూసెక్కులు, అవుట్ ఎ÷-లో 36,799 క్యూసెక్కులుగా ఉంది. పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 105.788 టీఎంసీలకు గాను.. ప్రస్తుతం నీటి నిల్వ సామర్థ్యం 101.500 టీఎంసీలుగా నమోదు అయ్యింది..ఇటు నంద్యాలలోని శ్రీశైలం జలాశయానికి వరద నీరు కొనసాగుతోంది. ఇన్ ఎ÷-లో 79,536 క్యూసెక్కులు, ఔట్ ఎ÷-లో : 67,626 క్యూసెక్కులుగా నమోదు అయ్యింది. పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుతం 884.50 అడుగులకు చేరింది. పూర్తిస్థాయి నీటి నిల్వ 215.8070 టీఎంసీలకు గాను.. ప్రస్తుతం 212.9198 టీఎంసీలుగా కొనసాగుతోంది. మరోవైపు కుడి గట్టు, ఎడమ గట్టు జల విద్యుత్ కేంద్రాలలో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది.

# జానీ మాస్టార్ మంచి వాడు

## అతను ఎలాంటి తప్పు చేయడు

## అనీ మాస్టర్ ఆసక్తికర వ్యాఖ్యలు



హైదరాబాద్, (ప్రజా మంటలు):

జానీ మాస్టార్ మంచివాడని మరో లేడీ కొరియో గ్రాఫర్ అనీ మాస్టర్ కితాబునిచ్చారు. అతను నిర్దోషి అని తేలితే పరిస్థితి ఏంటని కూడా ప్రశ్నించారు. తనకు తెలిసి జానీ ఎలాంటి తప్పు చేసే మనిషి కాదన్నారు. మహిళా కొరియోగ్రాఫర్‌పై లైంగిక దాడికి పాల్పడ్డారంటూ ఆరోపణలు ఎదుర్కుంటున్న ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ అరెస్ట్ అయి ప్రస్తుతం జైలులో ఉన్న విషయం తెలిసిందే. జానీ మాస్టర్‌పై వచ్చిన ఆరోపణలపై కొరియోగ్రాఫర్ అని మాస్టర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. శు క్రవారం మీడియాతో అని మాస్టర్ మాట్లాడుతూ... జానీపై కేసు పెట్టడంతో తాను షాక్‌కు గురైనట్లు తెలిపారు. నేషనల్ అవార్డ్ క్యాన్సిల్ అవటం బాధించిందన్నారు. అది తెలుగు టెక్నిషియన్ కి ఇచ్చిన పురస్కారమన్నారు. జానీ తప్పు చేసినట్లు ప్రూవ్ కాలేదని.. తాను జానీ దగ్గర రెండు సంవత్సరాలు వర్క్ చేసినట్లు చెప్పారు. జానీ మంచివారు.. ఎందుకో వారిపై ఆరోపణలు రావటం బాధాకారం..తప్పు జరిగితే శిక్ష పడాలి.. కానీ జానీ నిరపరాధి అని తెలితే ఏంటి..!! లేడి కొరియోగ్రాఫర్‌గా చెబుతున్నా.. ఈ ఫీల్డ్‌లో ఎంతో కష్టపడాలి. కెరీర్‌లో ఎప్పుడు నాకు కాస్టింగ్ కౌచ్ అనేది ఎదురు కాలేదు. విక్టిమ్ కొన్ని రోజుల వరకు జానీని దేవుడు అని చెప్పింది.. విక్టిమ్ జానీ మాస్టర్ వద్ద వర్క్ చేసేటప్పుడు హ్యాపీగా ఉండేది. కానీ సడెన్‌గా ఆరోపణలు చేయటాన్ని ఎలా చూడాలని అన్నారు. 'జానీ నాకు గురువు.. ఆయన ఇలా జైలులో ఉండటం ఏ మాత్రం కరెక్ట్ కాదనిపిస్తోంది.. అమ్మాయి విషయం కాబట్టి సెన్సిటివ్ విషయం కాబట్టి..ఎవరు మాట్లాడలేకపోతున్నారు? జానీపై ఇండస్ట్రీలోనే కుట్ర పన్నారనే విషయంపై నేను మాట్లాడలేను.. ఏ యూనియన్‌లోనైనా ఇష్యూస్ ఉంటాయి. డాన్సర్ కు హెల్త్ ఇష్యూ వస్తే ఫస్ట్ హెల్ప్ చేసేది జానీ, శేఖర్, భాను మాస్టర్స్. డాన్స్ మాస్టర్స్ యూనియన్ స్టాం÷-రగ్‌గా ఉంటుంది. గతంలో విక్టిమ్‌కు డాన్స్ యూనియన్ కార్డ్ కోసం జానీ మాస్టర్ వైఫ్ గట్టిగా అడిగారు.. విక్టిమ్‌కు కార్డ్ ఇవ్వాలంటే రూల్స్ రెగ్యులేషన్స్ ఫాలో కావాలి.. కానీ జానీ అధ్యక్షుడిగా ఆమె కార్డ్ ఇవ్వకుండా తొక్కి పెట్టారనటం తప్పు. విక్టిమ్ గతంలో నాతో తనకు హీరోయిన్ అవ్వాలని ఉందని చెప్పింది.. ముందు నువ్వు మంచి డాన్సర్ అవ్వమని చెప్పాను. జానీ కేసు జడ్జిమెంట్ కోసం అందరం వెయిటింగ్‌లో ఉన్నాము' అని కొరియోగ్రాఫర్ అని మాస్టర్ చెప్పుకొచ్చారు.

# ఏజెన్సీలో పెసా చట్టం నిబంధనలను పాటించాలి

## మద్యం దుకాణాలను గిరిజనులకే కేటాయించాలి

## సిఎం చంద్రబాబుకు సిపిఎం కార్యదర్శి లేఖ

విజయవాడ,అక్టోబర్18(ప్రజా మంటలు):

ఏజెన్సీ ఏరియాలో పెసా చట్టం నిబంధనలను తప్పనిసరిగా అమలు చేయాలని, మద్యం దుకాణాలు స్థానిక ఆదివాసీలకు కేటాయించాలని కోరుతూ భారత కమ్యూనిస్టు పార్టీ(మార్క్సిస్ట్) రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు ముఖ్యమంత్రి చంద్రబాబుకి లేఖ రాశారు. రాష్ట్ర ప్రభుత్వం మద్యం దుకాణాలు లబ్ధిదారుల ఎంపిక మరియు దుకాణాల ఏర్పాటుపై ప్రభుత్వ నోటిఫికేషన్ ను అనుసరించి గిరిజనేతరులు, స్థానికేతర గిరిజనులు ధరఖాస్తులు చేసుకున్నారు. గిరిజనేతరులు సిండికేట్లుగా ఏర్పడి తెలంగాణ రాష్ట్రం మరియు సరిహద్దు జిల్లాల నుండి షాపులు దక్కించుకున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో 40 దుకాణాలకు గాను సుమారు 2200 ధరఖాస్తులు ఆశావాహులు చేసుకున్నారు. దుకాణ లబ్దిదారుల ఎంపిక విషయంలో పెసా చట్టం నిబంధనలను ఉల్లంఘించారు. ఏజెన్సీ చట్టాలను ప్రభుత్వం గౌరవించలేదు. ఏజెన్సీ ప్రాంతంలో పైసా గ్రామసభకు లోబడి మద్యం దుకాణాలు నిర్వహించాలని ఏ.పి. పెసా రూల్స్ పేర్కొన్నారు. ఏజెన్సీ గ్రామాల్లో ఆదివాసీల ఆచారం, సంస్కృతి, సాంప్రదాయాలు, సామాజిక న్యాయం మరియు మతపరమైన పద్ధతులు, సామాజిక వనరులు నిర్వహణ, పరిరక్షణ, సాంప్రదాయ పద్ధతులలో వివాదాలు పరిష్కరించుకోవడానికి పెసా చట్టం ప్రకారం, అధికారాలను అమలు చేసుకోవడంతో పాటు లబ్దిదారులను ఎంపిక చేయు అధికారం, మద్యం దుకాణాలకు అనుమతులు ఇవ్వడం, రద్దుచేయడం అంతిమ అధికారాలు పెసా గ్రామసభకు మాత్రమే కలిగివున్నది. ఇట్టి విషయంలో పెసా గ్రామసభ ఆమోదం, తీర్మానం అత్యంత కీలకమైనది. అందువల్ల చట్టవిరుద్ధంగా ఏజెన్సీ ఏరియాలో అమలు చేస్తున్న మద్యం షాపులు వేలం రద్దు చేయాలని కోరుతునట్లు పేర్కొన్నారు. పెసా గ్రామసభకు మద్యం దుకాణాలు వినియోగం, అనుమతి విషయంలో చట్టం ప్రత్యేకమైనది, అంతిమమైనది. కావున పెసా చట్టం సెక్షన్ 4 క్లాజ్ డి.ఎన్ ప్రకారం గ్రామసభకు శాసనపరమైన స్వయంపాలన అధికారం కలిగివున్నది. స్థానిక గ్రామసభ పరిధిలోనే స్థానిక గిరిజనులకు మాత్రమే మంజూరు చేయాలని, వీటిని అనుసరించి ఏజెన్సీ గ్రామ ఆచారాలు, సంస్కృతి, సాంప్రదాయాలు, కట్టుబాట్లు ప్రకారం మద్యం దుకాణాల కోసం వచ్చిన ధరఖాస్తులను పరిశీలనచేసి గ్రామసభ పరిధిలోనే లబ్దిదారులను ఎంపిక చేయాలి. అర్హత కలిగిన ధరఖాస్తుదారులను గ్రామసభకు తెలియపర్చడంతో పాటు మద్యం దుకాణాల విషయంలో గిరిజనులకు లైసెన్స్ గ్రామసభ పరిధిల్లోనే ఎంపిక చేయాలని జిల్లా కలెక్టర్లు తగిన ఆదేశాలు జారీచేయాలని కోరుతున్నాం. ఏజెన్సీ మద్యం దుకాణాలు ఏర్పాటు చేయాలా? వద్దా? అనే అంశాన్ని పెసా గ్రామసభ సమక్షంలో చేతులు ఎత్తటం ద్వారా మెజార్టీ ఓటింగ్ ద్వారా తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నానట్లు లేఖలో పేర్కొన్నారు.

# టూవీలర్‌పై నుంచి పడి ప్రమాదం

## రోడ్డు ప్రమాదంలో టీచర్ మృతి

వినుకొండ,అక్టోబర్18(ప్రజా మంటలు):

పల్నాడు జిల్లా వినుకొండ మండలం గోకనకొండలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు మునగాల ధనలక్ష్మి(41) రోడ్డు ప్రమాదంలో మరణించారు. నాగులవరం వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. మృతురాలి భర్త నాగేశ్వరరావు, కుటుంబ సభ్యులు, తోటి ఉపాధ్యాయులు తెలిపిన వివరాల ప్రకారం బాపట్ల జిల్లా అద్దంకి చెందిన ధనలక్ష్మి మండలంలోని గోకన కొండ స్కూల్లో టీచరుగా పనిచేస్తున్నారు. ప్రతిరోజు టీచర్ ధనలక్ష్మి అద్దంకి నుండి గోకనకొండ స్కూలుకు వస్తారు. ఆర్టీసీ బస్సులో నాగులవరం వద్దకు వచ్చి అక్కడ ఉంచిన తన స్కూటీ వాహనంపై స్కూలుకు వెళ్తారు. అయితే ఇటీవల కురుస్తున్న వర్షాలకు గత మూడు రోజుల క్రితం గోకన కొండ నుండి స్కూటీపై అద్దంకి వెళితూ చక్రాయపాలెం స్కూల్లో పార్క్ చేసి వెళ్లారు. శుక్రవారం గోకనకొండ స్కూలుకు బయలుదేరి తన స్కూటీ తీసుకుని వచ్చేందుకు చక్రాయపాలెం స్కూల్ వద్దకు ఉదయం 8:30 వెళ్ళగా స్కూలు తాళం తీయకపోవడంతో తోటి ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు ద్విచక్ర వాహనం ఎక్కి గోకన కొండకు బయలుదేరారు. నాగులవరం గ్రామం వద్దకు రాగానే ఎదురుగా ఆర్టీసీ బస్సు రావడంతో ద్విచక్ర వాహనం మార్జిన్ దిగి రోడ్డుపై ఎక్కుతున్న క్రమంలో వాహనం అదుపుతప్పి ఉపాధ్యాయురాలు ధనలక్ష్మి రోడ్డుపై పడి తల వెనుక భాగం పగిలిపోయి అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాన్ని పోస్టార్టం నిమిత్తం వినుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు వినుకొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# 22, 23 తేదీలలో అమరావతి డ్రోన్ సమ్మిట్

## అధికారులతో సమీక్షించిన సిఎస్ నీరబ్ కుమార్

అమరావతి,అక్టోబర్18(ఆర్ఎన్ఎ):

డ్రోన్ సమ్మిట్‌పై వివిధ శాఖల సెక్రెటరీలు, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు జిల్లాల కలెక్టర్లతో ఏపీ సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈనెల 22, 23 తేదీలలో అమరావతి డ్రోన్ సమ్మిట్ జరగనుంది. డ్రోన్ సమ్మిట్ ఏర్పాట్లపై వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ సమీక్ష నిర్వహించారు. జాతీయ స్థాయి డ్రోన్ సమ్మిట్ కావడంతో ఏపీ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. అమరావతి డ్రోన్ సమ్మిట్‌లో 5500కు పైగా డ్రోన్లను వినియోగించనున్నారు. డ్రోన్ సమ్మిట్ ఏర్పాట్లను స్పెషల్ చీఫ్ సెక్రెటరీ సురేష్ కుమార్ పర్యవేక్షిస్తున్నారు. 14 రకాల థీమ్స్‌తో డ్రోన్ సమ్మిట్‌ను అమరావతిలో నిర్వహించనున్నారు.

# అమరజీవి ఆత్మార్పణానికి మరో కోణం

**అక్టోబర్ 19.. పొట్టి శ్రీరాములు ఆమరణ దీక్ష ప్రారంభించిన దినం**



రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

అక్టోబర్ 19, 1952లో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర డిమాండ్‌తో పొట్టి శ్రీరాములు మద్రాసులో ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించిన దినం.

50రోజుల నిరహార దీక్ష తరువాత, మద్రాసును వదులుకొంటే ఆంధ్ర రాష్ట్ర నిర్మాణం సాధ్యపడుతుందని ప్రధాని నెహ్రూ ప్రకటించినా, పొట్టి శ్రీరాములు అందుకు అంగీకరించ కుండా తన నిరాహార దీక్షను కొనసాగించి డిసెంబర్ 15వ తేదీన ఆత్మార్పణ చేసుకొన్న నేపథ్యం.

అమరజీవి'గా ప్రాచుర్యం పొందిన పొట్టి శ్రీరాములు ఆమరణ దీక్ష చేసి, ఆత్మార్పణం చేసుకున్న నేపథ్యం గురించి భిన్నాభిప్రాయాలు ఉన్నాయి.
ఆయన ఆమరణ నిరాహారదీక్ష
ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు కోసమే అనే మిగుల ప్రచారంలో ఉన్నా, దాని వెనక మద్రాసు నగర అంశం ప్రధానమని కొందరి అభిప్రాయము.
రాష్ట్ర ఏర్పాటు అనేది చాలా తీవ్రమైన రాజకీయ సమస్యగా మారిపోగా, అలాంటి రాజకీయ సమస్య కోసం శ్రీరాములు దీక్ష చేయటానికి ప్రధానంగా మద్రాసు నగర భవిష్యత్తే అని పలు వ్యాసాలను బట్టి మరో కోణానికి బలం చేకూరు తున్నది.

మద్రాసు ప్రెసిడెన్సీలో 40 శాతం జనసంఖ్య, 58 శాతం రాష్ట్ర విస్తీర్ణం తెలుగు వారిదే. రాష్ట్ర రాజకీయాలలో తమకు పలుకుబడి లేదని, తమిళు ల చేత అవహేళనకు గురౌతున్నామన్న భావన తెలుగు వారిలో మెదలైంది. 1911 లో ఆనాటి వార్తా పత్రికల వ్యాసాల ద్వారా, సంపాదకీయం ద్వారా తెలుగు ప్రజలలో ప్రత్యేక రాష్ట్ర వాంఛ మొదలైంది.1911 చివరి నాటికి ప్రత్యేక రాష్ట్ర చర్చ ఊపందుకుంది. తెలుగు మాట్లాడే ప్రజలందరూ ఒకే రాష్ట్రంగా ఏర్పడాలనే అభిప్రాయాలు ఆంధ్రరాష్ట్ర ఉద్యమం ప్రారంభమైనప్పటి నుండి వినబడు తుండేది. హైదరాబాద్ సంస్థానం విమోచన తర్వాత సమైక్య తెలుగు రాష్ట్రం ఏర్పాటుకు అవకాశాలు పెరిగాయి. 1949 లో అయ్యదేవర కాళేశ్వరరావు విశాలాంధ్ర మహాసభ ఏర్పాటు చేశారు. 1951 లో కూడా కాంగ్రెస్ అఖిల భారత సమావేశాలలో ఆంధ్ర కాంగ్రెస్ నాయకులు విశాలాంధ్ర విషయాన్ని ప్రస్తావించారు.

ఆంధ్ర రాష్ట్రం కోసం చేసిన 58 రోజుల ఆమరణ దీక్షకు ముందు శ్రీరాములు ఐదు సార్లు నిరాహార దీక్షలు చేశారు. నెల్లూరులో దళితులకు ఆలయ ప్రవేశం, అస్పృశ్యత నివారణ మొదలైన వాటికోసం ప్రచారం, నిరాహార దీక్షలు చేసి విజయం సాధించారు.

ఈ నేపథ్యంలోనే శ్రీరాములు లక్ష్య సాధన కోసం ఆమరణ దీక్ష ప్రారంభించాలని నిర్ణయించారు.

"మద్రాసును కేంద్ర పాలిత ప్రాంతం చేయాలి" అని 1952 సెప్టెంబర్ 15వ తేదీన శ్రీరాములు నెల్లూరు నుంచి భాగవతుల లక్ష్మీ నారాయణకు ఒక లేఖ రాశారు. అందులో.. "ఆంధ్ర రాష్ట్ర సమస్య అనేక మందికి, అనేక పార్టీలకు, అనేక అభిప్రాయాలకు, అనేక భావాలకు అనేక రకాలుగా పుట్టిల్లు అయ్యింది. ప్రతి ఒక్కరి స్వార్థమూ వేర్వేరుగా ఉంది. ప్రత్యక్ష ఆర్థిక లాభాలున్నాయి. కాబట్టి అందరూ పరమార్థ దృష్టితో ఆలోచిస్తే తప్ప ఏకాభిప్రాయానికి రాలేరు. అధికారంలో ఉన్న మహా నాయకుల దృష్టి మార్చాలంటే సామాన్యం కాదు. ఇందుకు ఒక్కటే మార్గం కనబడుతోంది. నిష్కామ దృష్టితో, ద్వేష రహితంగా, నిశ్చింతగా ప్రాణాలర్పించటమే. ఇక ఈ సమస్యను ఉపేక్షించటం పాపమని నిన్నే (1952 సెప్టెంబర్ 14) అనిపించింది".
తర్వాత 15 రోజులకు భీమవరంలో స్వామి సీతారాంను శ్రీరాములు కలిసి, లక్ష్మీనారాయణకు రాసిన లేఖను, దానితోపాటు పంపించిన 'ఆంధ్ర రాష్ట్రం' అనే వ్యాసాన్ని చూపించారు. వాటిని పరిశీలించిన స్వామి సీతారాం అక్టోబర్ 2వ తేదీన శ్రీరాములుకు తన స్పందన తెలియజేస్తూ లేఖ రాశారు. దీక్ష చేయాలన్న శ్రీరాములు నిర్ణయాన్ని అభినందిస్తూనే.. "ప్రస్తుతానికి మద్రాసు నగర భవిష్యత్తును గూర్చి పట్టుబట్టడం ఉచితం కాదు" అని సూచించారు. కానీ, ఆయన సూచనను శ్రీరాములు అంగీకరించ లేదు. "మద్రాసు నగర భవిష్యత్తు నిర్ణయించే బాధ్యతను పండిట్ నెహ్రూకు అప్పగించటానికి వీలులేదు. మద్రాసు నగర పౌరులే ఆ నగరం భవిష్యత్తుని నిర్ణయించాలి. నా దీక్ష వలన మద్రాసు నగరంలోని తమిళ ప్రముఖుల్లో కొందరిలోనైనా హృదయ పరివర్తన ఏర్పడి.. మద్రాసు నగరాన్ని కేంద్ర పాలిత రాష్ట్రంగా ఏర్పరచడానికి వారు అంగీకరించగలరని నేను నమ్ముతున్నాను. ప్రజాభీష్టాన్ని అమలు జరపడమే పండిట్ నెహ్రూ వంతు" అని పేర్కొన్నారు.

1952 అక్టోబరు 19వ తేదీన తన దీక్ష ప్రారంభించడానికి ముందు పత్రికలకు శ్రీరాములు ఒక ప్రకటన విడుదల చేశారు. అందులో.. "మద్రాసు నగర భవిష్యత్తు విషయమై మద్రాసు పౌరుల్లో ఏకాభిప్రాయం సాధించడానికి తీవ్రమైన కృషి జరగాలి" అని పేర్కొన్నారు.

దీక్షకు ఐదు రోజుల ముందు మద్రాసు పౌరులకు చేసిన విజ్ఞప్తిలో ఆయన ఇలా పేర్కొన్నారు..
"ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు చేయాలని తగినంత ప్రచారం, ఆందోళన, లెక్కల సేకరణ మొదలైనవి ఇప్పటికే జరిగాయి. 1916లోనే ఆంధ్రోద్యమ ప్రచారం ముమ్మరం కావటంతో ప్రత్యేకాంధ్ర రాష్ట్ర స్థాపన సమస్య అందరి దృష్టినీ ఆకర్షించింది. దానివలన కలిగిన తక్షణ ఫలితం అనిబిసెంటు అధ్యక్షతన 1917 డిసెంబరులో కలకత్తాలో జరిగిన కాంగ్రెస్ మహాసభలో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు సంఘాన్ని ఏర్పాటు చేయడం. 'ఆ రాష్ట్ర కాంగ్రెసు సంఘం మదరాసు నగరం మీద తక్కిన మదరాసు రాష్ట్ర కాంగ్రెసు సంఘంతో సమానంగా హక్కు కలిగి ఉంటుంది' అని ఒక తీర్మానం కూడా ఆ సందర్భంగా ఆమోదించబడింది."

ఆయనదీక్షను చేపట్టాక...విరమించడానికి రెండు షరతులు పేర్కొన్నారు.
1) మద్రాసు నగర భవిష్యత్తు విషయమై మద్రాసు పౌరుల్లో ఏకాభిప్రాయం ఏర్పడటం.
2) భారత ప్రభుత్వం రాజ్యాంగం లోని 3వ ఆర్టికల్ కింద ఆంధ్ర రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించటం.

" పొట్టి శ్రీరాములు దీక్ష వెనుక లక్ష్యం గురించి ఆయన మేనల్లుడు ఎన్ఆర్ గుప్తా మాటల్లో.. "మద్రాసు ఉమ్మడి సొత్తుగా ఉండాలని ఆయన అనుకుంటూ వచ్చారు. మద్రాసు మన సొత్తు కావచ్చు. అయితే, వాళ్లు (తమిళులు) మనం చాలా కాలంగా కలసి ఉంటున్నాము. అలాంటప్పుడు మనల్ని వాళ్లు వెళ్లిపొమ్మంటే ఎంత కష్టపడతామో.. వాళ్లను మనం వెళ్లిపొమ్మన్నా అంత కష్టపడతారు. అందువల్ల ఉమ్మడిగా నగరం చేస్తే బాగుంటుందన్నారు."

"మరి నిర్వివాద ప్రాంతాలతో చాలామంది రాష్ట్రం కావాలంటున్నారు కదా! అంటే.. 'మనం మద్రాసు ఎందుకు వదులు కోవాలి? వేరేచోటకు వెళ్లి మట్టిలోను, ఇటుకల్లోను రూ. 15-20 కోట్లు ఎందుకు పోసు కోవాలి? ఇంత డబ్బు ఎందుకు వృథా చెయ్యాలి? త్వరగా రాష్ట్రం వస్తుందని ఉన్న హక్కు ఎవరైనా వదులు కుంటారా? అసలు ఆ మాటకు వస్తే మద్రాసుపై మనకు ఎక్కువ హక్కు ఉంది. ఇదంతా గుర్తించే ధార్ కమిటీ మద్రాసును ప్రత్యేక రాష్ట్రం చెయ్యాలని న్యాయంగా తీర్పు చెప్పింది. మన రాజధాని ఈ నగరంలో వద్దు అని అంతా అంటే నేను ఏమంటా? ఆంధ్ర రాష్ట్రపు రాజధాని వేరేచోట పెట్టుకోవచ్చు. అయితే, ఈ వ్యవహారాన్ని సామరస్యంతో పరిష్కరించుకోవాలి."

అయితే, మద్రాసు కోసం ఎందుకు ఉపవాసం చేయటం, విడిచి పెట్టవచ్చు కదా? అని తాను అడిగానని, అందుకు శ్రీరాములు స్పందిస్తూ.. "నేను చచ్చిపోవాలని చెయ్యడం లేదు. మనకు న్యాయమైన హక్కు ఉన్నదనటం కోసం చేస్తున్నాను. అదివస్తే సంతోషిస్తాను. రాకపోతే చచ్చిపోతాను. నేను పోతే దీన్ని సాధించటానికి ఎవరికైనా అవకాశం ఉండవచ్చు" అన్నారని గుప్తా తెలిపారు. (ఆంధ్ర పత్రిక: 18 డిసెంబర్ 1952)

ప్రకాశం పంతులు మాటల్లో చెప్పాలంటే.. "ఉపవాసం చెయ్యడానికి ఎవ్వరూ స్థలం ఇవ్వకపోతే అట్టలు కట్టుకొని, వీధుల్లో తిరిగి ప్రాణాలైనా అర్పిస్తానన్న పట్టుదల గల మనిషి శ్రీరాములు". ఆయనకు ఆశ్రయం ఇచ్చేందుకు బులుసు సాంబమూర్తి ముందుకు వచ్చారు. పొట్టి శ్రీరాములు 1952 అక్టోబర్ 19వ తేదీన బులుసు సాంబమూర్తి ఇంట్లో ఆమరణ దీక్ష ప్రారంభించారు. 1952 అక్టోబర్ 19వ తేదీ నుంచి డిసెంబర్ 15వ తేదీ వరకు ఆమరణ నిరాహార దీక్ష చేశారు.

మద్రాసు లేకుండా ఆంధ్ర రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు డిసెంబర్ 19వ తేదీన లోక్‌సభలో ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ ప్రకటించారు. ఈ మేరకు వాంఛూ కమిటీని ఏర్పాటు చేశారు. 1953 అక్టోబర్ 1వ తేదీన కర్నూలు రాజధానిగా ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది. 2008 మే 22వ తేదీన నెల్లూరు జిల్లా పేరును శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాగా మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.



# ద్వారకా తిరుమలలో వైభవంగా బ్రహ్మోత్సవాలు

## రాజమన్నార్ అలంకరణలో దర్శనమిచ్చిన స్వామి

ఏలూరు, అక్టోబర్18 (ప్రజామంటలు):
ఏలూరు జిల్లాలోని లోని ప్రముఖ పుణ్య క్షేత్రం ద్వారకా తిరుమల చిన తిరుపతిలో ఆశ్వయుజ మాస బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. 6 వ రోజు శుక్రవారం చిన వెంకన్న రాజమన్నార్ అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్నారు. అలాగే రాత్రి 7 గంటలకు స్వామి వారి రథోత్సవం జరగనుంది.కాగా ద్వారకా తిరుమలలో ఏడాదిలో రెండు సార్లు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. ఒకసారి వైశాఖమాసంలో, మరోసారి అశ్వయుజ మాసంలో స్వామివారికి వైభవంగా బ్రహ్మోత్సవాలు జరుపుతారు. ఈ బ్రహ్మోత్సవాలను ఎనిమిది రోజులపాటు ఘనంగా నిర్వహిస్తారు. శుక్రవారం ద్వారకా తిరుమలలోని మాఢ వీధుల్లో స్వామివారి రథోత్సవం నిర్వహిస్తారు. అశ్వయుజ మాస బ్రహ్మోత్సవాలు జరిగే 8 రోజులపాటు వివిధ వాహనాలపై స్వామి, అమ్మవార్లు భక్తులకు దర్శనం ఇస్తారు. కాగా శనివారం ఉదయం ఏడు గంటలకు చక్రస్నానం, రాత్రి ఏడు గంటలకు శ్రీవారి ధ్వజావరోహణ కార్యక్రమాలు జరుగుతాయి.కాగా గురువారం చిన వెంకన్న కల్యాణం తంతును అర్చకులు వైభవంగా నిర్వహించారు. సర్వాభరణ భూషితుడై, పెండ్లి కుమారుడిగా సర్వజగరకుడైన శ్రీవారు. బుగ్గన దుక్కలతో సిగ్గులొలుకుతున్న అలివేలు మంగ ఆండాళ్. దేవేరులను పరిణయమాడారు. ఈ కల్యాణ ఘడియలో స్వామి చిన్న మంగళ స్వరూపాన్ని వీక్షించి భక్తులు తరించారు. ఈ బద్భుత దృశ్యం ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం రాత్రి ఆవిష్కృతమైంది. పాంచాహ్నిక దీక్షతో వైఖానస ఆగమాన్ని అనుసరించి జరిగిన ఈ కల్యాణ తంతులో ఆలయ అర్చకులు ముందుగా శాంతి హోమాన్ని చేసి సర్వదేవతారాధన. సంకటం, కరణ పూజలు నిర్వహించారు. దేవస్థానం తరపున ఆలయ చైర్మన్ రాజా ఎస్వీ సుధాకరరావు ప్రభుత్వం తరఫున గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు స్వామి అమ్మ వార్లకు పట్టువస్త్రాలు అందించారు. ఆ తర్వాత అర్చకులు స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న చైర్మన్ సుధాకరరావు, ఎమ్మెల్యే మద్దిపాటి, ట్రస్ట్ విద్యుతరావు మూర్తులకు మధువర్యాలను సమర్పించారు సుముహూర్త సమయంలో నూతన వధూవరుల శిరస్సులపై జీలకర్ర, బెల్లం ధరింపచేసి భక్తుల గోవిందనామ స్మరణల నడుమ మాంగల్య చారణ, తలంబ్రాలు వైభవోపేతంగా జరిపించారు. అలండు ఈవో ఎస్వీఎస్ఎన్ మూర్తి కల్యాణ ఏర్పాట్లను పర్యవేక్షించగా, ఈఈ భాస్కర్ పాల్గొన్నారు.

# తిరుమల భక్తులకు శుభవార్త

## జనవరి ఆర్జిత సేవాటిక్కెట్లు నేడు విడుదల చేయనున్న టిటిడి

తిరుమల,అక్టోబర్18(ప్రజామంటలు):
ప్రపంచవ్యాప్తంగా తిరుమల శ్రీవారికి కోట్లాది మంది భక్తులున్నారు. వారంతా ఏడాదిలో ఏదో ఒక రోజులో.. ఆయన్ని దర్శించుకునేందుకు తిరుమలకు తరలి వస్తారు. ఆ క్రమంలో భక్తుల సౌకర్యార్థం తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) వివిధ చర్యలు చేపట్టింది. వారిని దృష్టిలో ఉంచుకుని శ్రీవారి సుప్రభాత సేవ నుంచి ఏకాంత సేవ వరకు ఉన్న పలు సేవా టికెట్లను టీటీడీ విక్రయిస్తుంది. ఆ క్రమంలో 2025 జనవరికి సంబంధించిన శ్రీవారి ఆర్జిత సేవలు, దర్శన టికెట్ల కోటాను అక్టోబర్‌లో టీటీడీ అందుబాటులోకి తీసుకురానుంది. అందులోభాగంగా తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లకు సంబంధించి జనవరి కోటాను శనివారం ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) విడుదల చేయనుంది. సేవా టికెట్ల ఎలక్ట్రానిక్ డిప్ కోసం అక్టోబరు 21వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకో వచ్చని టీటీడీ ప్రకటించింది. అయితే ఈ టికెట్లు పొందిన భక్తులు అక్టోబర్ 21వ తేదీ నుంచి 23వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు సొమ్ము చెల్లించాల్సి ఉంటుందని తెలిపింది. ఇక వారికి లక్కీడిప్‌లో టికెట్లు మంజూరవుతాయని వివరించింది. కళ్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవా టికెట్లను అక్టోబర్ 22న ఉదయం 10 గంటలకు విడుదల చేస్తామని వివరించింది. వర్షాకాలం కావడంతో.. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో భారీగా వర్షాలు కురుస్తున్నాయి. ఇక తిరుమలలో సైతం భారీగా వర్షం పడుతుంది. దీంతో తిరుపతి చుట్టుపక్కన ఆవరించిన ఏడుకొండలు సైతం పచ్చదనాన్ని పరుచుకుంది. ఓ వైపు వరుస సెలవులు రావడం.. వాతావరణం అహ్లాదకరంగా మారడంతో తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా క్యూ కడుతున్నారు.

# 20న వారణాసిలో ప్రధాని పర్యటన

## పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు



వారణాసి, అక్టోబర్18 (ప్రజామంటలు):
భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అక్టోబర్ 20న తన సొంత పార్లమెంటరీ నియోజకవర్గమైన వారణాసిలో పర్యటించనున్నారు. సుమారు ఆరు గంటలపాటు కాశీలోనే బస చేయనున్నారు. ఉత్తరాదిన పెద్ద పండుగగా జరుపుకునే దీపావళి పర్వదినానికి కొద్ది రోజుల ముందే వారణాసితో సహా దేశవ్యాప్తంగా రూ. 3,254.03 కోట్ల విలువైన ప్రాజెక్టలను చేపట్టనున్నారు. రూ.380.13 కోట్లతో 15 ప్రాజెక్టులకు ప్రారంభోత్సవం, రూ.2,874.17 కోట్లతో రెండు ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్నారు. వారణాసి పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ సిగ్రా స్పోర్ట్స్ స్టేడియంలో బహిరంగ సభలో కూడా ప్రసంగిస్తారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వారణాసి నుంచే దేశంలోని 6 విమానాశ్రయాలను అభివృద్ధి చేసే ప్రాజెక్టులను ప్రారంభిస్తారు. బాగ్‌డోగ్రా (బెంగాల్), దర్భంగా (బీహార్), ఆగ్రా (యూపీ) విమానాశ్రయాల్లో కొత్త సివిల్ ఎన్‌క్లేవ్‌ల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. వాటి అంచనా వ్యయం రూ.3,041 కోట్లు. ఇది కాకుండా, రేవా ఎయిర్‌పోర్ట్‌లో కొత్త టెర్మినల్ బిల్డింగ్ నిర్మాణం, మా మహామాయ ఎయిర్‌పోర్ట్ అంబికాపూర్‌లో కొత్త టెర్మినల్ బిల్డింగ్ నిర్మాణం, సర్సావా ఎయిర్‌పోర్ట్‌లో సివిల్ ఎన్‌క్లేవ్ నిర్మాణ ప్రాజెక్టులను ఆయన వర్చువల్ విధానంలో ప్రారంభిస్తారు. వీటి కోసం రూ.255.18 కోట్లు ఖర్చు చేయనున్నారు.

# ఉపాధి రంగాలను బలోపేతం చేయాలి !

తెలుగు రాష్ట్రాల్లో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉంది. సమస్య కొండంతగా ఉంటే చర్యలు మాత్రం గోరంత అన్నచందంగా ఉన్నాయి. మరోవైపు ఐటి కంపెనీల్లో తీసివేతలు పెరుగుతున్నాయి. స్కిల్ లేకపోవడం వల్లనే అని తెలంగాణ సిఎం రేవంత్ ఇటీవలే ప్రకటించి, స్కిల్ వర్సిటీకి పునాది వేశారు. నిజానికి క్షేత్రస్థాయి లోనే విద్యారంగంలో మార్పులు రావాలి. విద్యార్థులు రాటుదేలేలా తర్ఫీదు ఇవ్వాలి. వారు ఎంచుకంటున్న ఆయా రంగాల్లో నిష్ణాతులను తయారు చేయాలి. అప్పుడే వారు ఏ పరిశ్రమలో అయినా రాణిస్తారు. అది ఓ పక్క జరుగుతుండగానే ఉన్న నిరుద్యోగులకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పించాలి. ఉద్యోగమంటే కేవలం ప్రభుత్వ ఉద్యోగమే కాదు.. ప్రైవేట్ రంగంలోనూ వారికి అవకాశాలు కల్పించాలి. అలాగే సొంతకాళ్ల మీద నిలబడేలా ఉపాధికి అవకాశాలను పెంచాలి. బ్యాంకులు ఇతోధికంగా రుణాలు ఇచ్చేలా చేయాలి. ఇవన్నీ సాకారం కావాలంటే వ్యవసాయరంగం, అనుబంధ రంగాలు బలపడాలి. పారిశ్రామిక రంగం పురోగమించాలి. ఇవన్నీ కూడా యుద్ధప్రాతిపదికన సాగాలి. యువత ఆకాంక్షల మేరకు అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వాలు కృషి చేయాలి. ఎందుకంటే ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కొత్త ప్రభుత్వాలపై ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ రాష్ట్రంలో ప్రభుత్వం మారింది. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కొత్త ప్రభుత్వం వచ్చింది కాబట్టి నిరుద్యోగుల్లో ఆశ పెరిగింది. కొత్తగా పరిశ్రమలు వస్తాయి. తమకు ఉద్యోగాలు వస్తాయని ఎదురు చూస్తున్నారు. టిడిపి ప్రభుత్వం పారిశ్రామిక అభివృద్ధి విషయంలో గత ప్రభుత్వంతో పోల్చినపుడు కొంత మెరుగుగా పనిచేస్తోంది. ఇప్పటికే తెలంగాణలో సిఎం సహా మంత్రులు అమెరికా తదితర దేశాలు చుట్టివచ్చారు. పరిశ్రమల ఏర్పాటుకు ఆహ్వానాలు పలికారు. ఎపి మంత్రి లోకేశ్ త్వరలో అమెరికా వెళ్లనున్నారు. పారిశ్రామక వేత్తలకు చంద్రబాబ కూడా రెడ్ కార్పెట్ పరిచారు. 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' ఎపుడో వచ్చింది. ప్రభుత్వ ఖజానాలో కొంత ప్రైవేటుకు ఇచ్చి ప్రభుత్వ రంగ బ్యాంకుల చేత రుణాలు ఇప్పించిన తరువాత ప్రైవేట్ కంపెనీలు వేసే రోడ్లు, విమానాశ్రయాలు, చేసే విద్యుత్తు ఉత్పత్తి తదితర మౌలిక సౌకర్యాలు ఎవరికి అందుబాటులో ఉన్నాయి? ఎవరి మీద భారాలు పడుతున్నాయన్నది ఆలోచించాలి. పన్నుల సరళీకరణ సాగాలి. చిన్నచిన్న పనులను పెంచాలి. కంపెనీలకు మేలు చేసేలా నిర్ణయాలు ఉండరాదు. ప్రజలకు మేలు చేసేలా విధానాలు ఉండాలి. ఎస్.ఇ.జెడ్ లలో వచ్చిన కంపెనీలకు భూములు ఇచ్చి రైతులు ఆ కంపెనీల్లో కూలీలుగా మారారు. పరిశ్రమల నిర్మాణ సమయంలో వచ్చే, పోయే లారీల్లో దింపుడు, ఎత్తుడు హమాలీలయ్యారు. కోల్‌కొతా- చెన్నరు రహదారి పక్కన తమిళనాడు సరిహద్దులో ఉన్న పేరు మోసిన ఎస్.ఇ.జెడ్.లో భూములు కోల్పోయిన రైతులు గతిలేక ఎస్.ఇ.జెడ్ భూముల్లోకి గొడ్లు రాకుండా చూసుకునే కూలీలుగా మారడానికి కూడా సిద్ధపడుతున్నారు. గంగవరం పోర్టులాంటి వాటికోసం, విశాఖ ఉక్కు కోసం భూములు త్యాగాలు చేసిన వారు ఏమవుతున్నారు. ఈ దిశగా ప్రభుత్వాలు ఆలోచన చేయాలి. తెలంగాణలో మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ లాంటి వాటికి భూములు ఇచ్చిన రైతులు ఇవాళ దిక్కులేకుండా పడివున్నారు. ఇలాంటి అభివృద్ధి ఎవరి కోసమన్నది కూడా ఆలోచన చేయాలి. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ఎస్.ఇ.జెడ్ లో ఉన్న ఒక కంపెనీలో భూములు ఇచ్చిన రైతు కుటుంబాలకు చెందిన 70 శాతం మంది కార్మికులుగా చేరారు. కానీ 12 సంవత్సరాల తర్వాత కూడా కంపెనీ వారిని కార్మికులుగా కూడా గుర్తించడంలేదు. నైపుణ్యాన్ని బట్టి వేతనాలు ఇవ్వలేదు. కంపెనీ చేసిన ఆర్థిక తప్పిదానికి ప్రస్తుతం మూతపడింది. భూములు ఇచ్చిన కార్మికుల రెక్కలు ముక్కలయ్యాయి.ప్రజల భాగస్వామ్యం ఉన్నా ఏమీ మెరుగ్గా ఒరగబెడుతుందో
ప్రభుత్వం చెప్పాలి. నిజంగా చెప్పాలంటే ప్రభుత్వాలు ఏకపక్షంగా పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసమే పని చేస్తున్నాయి. యూనియన్లు పెట్టుకోనివ్వటం లేదు. అలా ముందుకు వచ్చిన వారిని ఉద్యోగాల నుండి తొలగిస్తున్నారు. ప్రైవేట్ పరిశ్రమల్లో గుర్తింపు ఎన్నికలు మూలపడ్డాయి. తనిఖీలను ఎత్తివేశారు. కార్మికుల భద్రతను గాలికొదిలేశారు. అంటే వెట్టి చాకిరీ చేయించుకునే వ్యవస్థను ప్రభుత్వమే ప్రోత్సహిస్తోందని అర్థం చేసుకోవాలి. నీస వేతన చట్టం ప్రకారం 5 సంవత్సరాలకు ఒకసారి కార్మికులు వేతనాలు పెంచాలి. ఆయా కంపెఈల్లో వేతనాలను కూడా నైపుణ్యాలకు తగినట్లుగా ఇవ్వటం లేదు. అదానీ పోర్టులో కూడా ఇదే పరిస్థితి. కార్మికులను కదలకుండా చేయటానికి పోర్టుల్లో, ఎస్.ఇ.జెడ్ లలో పోలీసు స్టేషన్లు వచ్చాయి. యూనియన్లకు ప్రవేశం లేదు. విడివిడిగా ఉండే ప్రైవేట్ పరిశ్రమలన్నింటిలో కూడా ఇదే పరిస్థితి. అంటే భూములతో పాటు అన్ని వసతులు కల్పిస్తే లాభపడుతున్నది కేవలం పరిశ్రమల యజమానులే తప్ప ప్రజలు కాదని ప్రభుత్వాలు గుర్తించాలి. ఇలాంటి పరిస్థితులు కల్పించే కంపెనీలను దగ్గరకు రాకుండా చూడాలి. ప్రభుత్వమైనా ఆ పథకం ఇస్తాం, ఈ పథకం ఇస్తామని మభ్యపెడుతున్నాయి తప్పిస్తే కార్మికులకు వేతనాలు పెంచుతాం, కార్మిక హక్కులను కాపాడతామని చెప్పటం లేదు. నిజానికి పరిశ్రమలు పెట్టేది ప్రజలకు ఉదద్యోగ ఉపాధి అవకాశాలు పెంచడానికే అని గుర్తించాలి. పెత్తందార్లను తయారు చేసి ప్రజలను వెట్టి చాకీరీ చేయించుకోవడానికి కాదని ప్రభుత్వాలు గుర్తించాలి. అలాంటి వారి కోసం రైతులు ఎందుకు భూములు త్యాగం చేయాలి. ఎందుకు కూలీలుగా మారాలి అన్నది గుర్తించాలి. అలాకాకుండా భూముల్లో బంగారం పండించేలా రైతులను ప్రోత్సహించాలి. వ్యవసాయ అనుబంధరంగాలను ప్రోత్సహించాలి. పర్యావరణం కూడా పరిగణనలోకి తీసుకోవాలి. అలా చేస్తేనే ఉపాధి ఉద్యోగ రంగాలు బలపడతాయని గుర్తించాలి.

# తన పట్టా భూమిలో నుంచి అక్రమంగా తోవ ఏర్పాటు యత్నాలను నిరసిస్తూ ఆందోళన

## గొల్లపల్లి తహసిల్దార్ కార్యాలయం ఎదుట రైతు కుటుంబ సభ్యుల ధర్నా

గొల్లపల్లి (ప్రజామంటలు) అక్టోబర్ 18 : రైతు కుటుంభ సభ్యులు చేసిన ఆందోళన సంఘటన గొల్లపల్లి మండల కేంద్రంలో తీవ్ర కలకలం రేపింది. తన పట్టా భూమిలో నుంచి ఎలాంటి పరిహారం ఇవ్వకుండా నేటిపారుదల రెవెన్యూ శాఖ అధికారులు బలవంతంగా తన సమ్మతి లేకుండా సర్వే చేయించి తన పట్టా భూమిని అక్రమంగా లాక్కుంటున్నారంటూ బాధిత రైతు ఆరోపిస్తున్నాడు. అయితే ల్యాండ్ ఆక్వేజేషన్లో భాగంగా అందరి రైతుల పట్టా భూములతో పాటు నరేష్ అన్న రైతు భూమిని సర్వే చేసామే చేసిన తప్పు మరొకటి కాదని బాదిత రైతు ఆరోపించినట్టుగా అతని భూమిలో నుంచి ఎలాంటి తోవ ఏర్పాటు చేయడానికి కాదని తాహాసిల్దార్ వరందన్ పేర్కొన్నారు. వివరాల్లోకి వెళ్తే మండలంలోని బీబిరాజు పల్లి గ్రామానికి చెందిన నులిగొప్పుల నరేష్ అనే రైతు తన భార్య ,వదిన, తల్లిదండ్రులతో కలిసి కార్యాలయానికి తరలివచ్చి కార్యాలయం ఎదుట బైఠాయించి ఆందోళన నిర్వహించారు తన భూమిలో నుంచి తోవ తీయవద్దని అధికారులు తనకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు దీంతో పోలీసులు సంఘటన స్థలికి చేరుకున్నారు బాధిత రైతు సందర్భంగా బాదిత రైతు నరేష్ మాట్లాడుతూ తన పట్ట భూముల నుంచి అక్రమంగా తోవ తీయడానికి గ్రామానికి చెందిన కొందరు కుట్రలు పన్నుతున్నారని వారికి అధికారులు వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు కాలువ పరిసరాల్లో చాలామంది రైతుల పట్టా భూములు ఉన్నాయని వారెవ్వరి భూములను సర్వే చేయకుండా తనొక్కడివే సర్వే చేసి తన పట్టా భూముల నుంచి తొవ తీయడానికి యత్నిస్తున్నారని దీనిపై గతంలో








సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడమే కాకుండా బలవంతంగా సర్వే చేయడానికి అధికారులు వచ్చారని, అధికారుల వైఖరికి తీవ్ర మనస్థాపం చెందినట్లు సంబంధిత రైతు తెలిపారు.

తహసిల్దార్ వరందన్ బాధిత రైతు వద్దకు వచ్చి మాట్లాడారు పట్టా భూముల నుంచి ఎలాంటి తోవ ఏర్పాటు చేయడం లేదని భయాందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొనడంతో ఆందోళనను విరమించారు ఈ సందర్భంగా ఆయన ఆక్వేజేశన్లో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సర్వే చేశామని అంతేకానీ పట్టా భూముల నుంచి తోవ ఏర్పాటు చేసే అధికారం తనకు లేదని పేర్కొన్నారు నేను మండలంలో నూతనంగా బాధ్యతలు చేపట్టానని దీనిపై పూర్తి స్థాయిలో పరిశీలించి తగు చర్యలు తీసుకుంటానని తెలిపారు.



## ప్రజా భవన్ లో భారీ సంఖ్యలో వచ్చిన వినతులను పరిశీలించిన చిన్నారెడ్డి

హైదరాబాద అక్టోబర్ 18 (ప్రజా మంటలు) : మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చి తమ అర్జీలను అందజేశారు. ప్రజావాణి కార్యక్రమంలో 627 దరఖాస్తులు అందాయి. రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య అర్జీలను స్వీకరించారు. అర్జీదారుల సమస్యలు ఓపికగా విని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి దరఖాస్తులపై చిన్నారెడ్డి ఎండార్స్ చేసి సమస్యల తక్షణ పరిష్కారానికి కృషి చేశారు.పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చినా ఎంతో సహనంతో చిన్నారెడ్డి వారి సమస్యలు ఓపికతో విన్నారు. ప్రతి ప్రజావాణి కార్యక్రమంలో ఇళ్ల కోసం దరఖాస్తులు అందుతున్నాయి. ఈసారి కూడా 185 దరఖాస్తులు ఇళ్ల కోసం వచ్చాయి. సాంఘిక సంక్షేమ శాఖకు సంబంధించి 108 దరఖాస్తులు, రెవెన్యూ శాఖకు 60, విద్యుత్ శాఖ 57, ప్రవాసి ఎన్. ఆర్. ఐ. విభాగానికి సంబంధించి 4 , ఇతర శాఖల 213 దరఖాస్తులు ప్రజావాణిలో అందాయి. ఈ దరఖాస్తులు అన్నింటినీ ఆన్ లైన్ ద్వారా సీఎం ప్రజావాణి పోర్టల్ నుంచి సంబంధిత శాఖల అధికారులకు పంపారు. వివిధ శాఖలకు చెందిన నోడల్ అధికారులు చిన్నారెడ్డి, దివ్యలకు సహకారాన్ని అందించారు.

## కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కి శుభాకాంక్షలు తెలిపిన ముఖ్యమంత్రి

కోరుట్ల అక్టోబర్ 18 (ప్రజా మంటలు) : కోరుట్ల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ జన్మదినం సందర్భంగా ముఖ్యమంత్రి ఎనముల రేవంత్ రెడ్డి పుట్టినరోజు శుభాకాంక్షలతో శాసనసభ్యులుగా తెలంగాణ రాష్ట్రంలో ప్రజాసేవలో ఉంటున్నందుకు కృతజ్ఞతలతో లెటర్, పూల బొకే ద్వారా ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారని బారాసా నాయకులు పేర్కొన్నారు. భారాస నేతలు కేక్ కట్ చేసి ఆయనకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో కోరుట్ల పట్టణ మండల బారాస నాయకులు పండ్లు పంపిణీ చేశారు.




తేది: 18-10-2024

శ్రీ కల్వకుంట్ల సంజయ్ గారు,

(ఎనుముల రేవంత్ రెడ్డి)

శ్రీ కల్వకుంట్ల సంజయ్ గారు,

## హత్య కేసును చేదించిన కోరుట్ల పోలీసు అధికారులు

### అదుపులో ఐదుగురు నిందితులు.. పరారీలో ఒక నిందితుడు

### వివరాలు వెల్లడించిన డి.ఎస్.పి ఉమామహేశ్వరరావు

కోరుట్ల అక్టోబర్ 18 (ప్రజా మంటలు) : జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని ప్రకాశం రోడ్ లో ఆదివారం రాత్రి జరిగిన హత్య కేసులోని నిందితులను కోరుట్ల పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మృతుడు బోయిని సాగర్, పంబాల మధు, నరేష్ మధ్య గొడవ జరగగా మృతుడు బోయిని సాగర్ పంబాల నాగరాజు ఇంటి వద్దకు వెళ్లి నానా రచ్చ చేసి ఎప్పటికైనా మధు నరేష్ లను హతమరుస్తానని బెదిరించాడు.వీళ్ళ మధ్య సయోధ్య కుదుర్చుడానికి వచ్చిన గుద్దేటి వెంకటేష్, గుద్దేటి విజయ్, రాకేష్ లు నాగరాజ్ ఇంటికి వెళ్లి అక్కడ నాగరాజుతో గొడవ పడుతున్న మృతుడు సాగర్ ను వారి ఇంటి నుండి బయటకు గుంజుకొని వచ్చి నాలుగు రోడ్ల కూడలి వద్ద సాగర్ ను నెట్టివేయగా కింద పడిపోయాడు. అప్పుడు,సాగర్ ను గుద్దేటి వెంకటేష్ తన వద్ద గల కత్తితో గొంతు కోసి చంపినాడు. అనంతరం సంఘటనస్థలం నుండి నిందితులు పారిపోగా, నిందితుల కోసం కోరుట్ల సి.ఐ సురేష్ బాబు, ఎస్.ఐ శ్రీకాంత్ వారి సిబ్బందితో గాలింపు చర్యలు చేపట్టారు.పక్క సమాచారంతో గురువారం ఉదయం కోరుట్ల పట్టణ చివర్లోని వెంకటేష్ కు చెందిన నాగులమ్మ బ్రిక్స్ ఫ్యాక్టరీలో నిందితులు ఉన్నారని తెలియడంతో కోరుట్ల సీఐ సురేష్ బాబు ఎస్సై శ్రీకాంత్ వారి సిబ్బందితో అక్కడికి వెళ్లి 5గురు నిందితులను అరెస్టు చేసారు వారి వద్ద నుండి మృతుడిని చంపడానికి ఉపయోగించిన ఒక కత్తి,రెండు బైకులు, నాలుగు సెల్ఫోన్లను పోలీసులు స్వాధీన పరుచుకున్నారు. మరో నిందితుడు పంబాల నాగరాజు పరారీలో ఉన్నాడని, అతడిని త్వరలో పట్టుకుంటామని అన్నారు. కేసును తొందరగా చేదించిన అధికారులను మెటుపల్లి డిఎస్పి ఉమామహేశ్వరరావు అభినందించాడు.



## గణేష్ నవదుర్గా మండలి ఆద్వర్యంలో ఘనంగా 'పౌర్ణమి పూజ'

కోరుట్ల అక్టోబర్ 18 (ప్రజా మంటలు) : కోరుట్ల గణేష్ నవదుర్గా మండలి ఆద్వర్యంలో జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని త్రిశక్తి మాత దేవాలయంలో గురువారం సాయంత్రం ఘనంగా 'పౌర్ణమి పూజ' నిర్వహించారు. గణేష్ నవదుర్గా మండలి ఆద్వర్యంలో త్రిశక్తి మాత దేవాలయంలో నిర్వహించిన దుర్గా దేవి నవరాత్రి ఉత్సవాలు విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా సహకరించిన దాతలు, పాత్రికేయ మిత్రులను ఘనంగా సత్కరించారు. అనంతరం అమ్మవారి ఓడి బియ్యంతో అన్నప్రసాదం వితరణ జరిపారు. ఈ సందర్భంగా గణేష్ నవదుర్గా మండలి అద్యక్షులు కటుకం గణేష్ మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం దుర్గా దేవి నవరాత్రి ఉత్సవాలు ముగిసిన అనంతరం కోజాగిరి పౌర్ణమి సందర్భంగా 'పౌర్ణమి పూజ' నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఉత్సవాలకు సహకరించిన దాతలు, పాత్రికేయ మిత్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గణేష్ నవదుర్గ మండలి అధ్యక్షులు కటుకం గణేష్, ఉపాధ్యక్షులు తాటిపాముల రమేష్, ప్రధాన కార్యదర్శి గజ్జల శంకర్, సహాయ కార్యదర్శి పోతని రాజేశం, కోశాధికారి ఆడువాల ప్రభాకర్, సభ్యులు కటుకం గంగారాం, సంకు అశోక్, కస్తూరి రాజేశ్వర్, గాజుల రమేష్, వేముల నందీశ్వర్, కార్తీక్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



## కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటా

### భాజపా నాయకులు సురభి నవీన్ కుమార్

కోరుట్ల అక్టోబర్ 18 (ప్రజా మంటలు) : కోరుట్ల మండలం నాగులపేట గ్రామం బీజేపీ కార్యకర్తలు చౌలమద్ది మనోహర్, చౌలమద్ధి మనోజ్ అనే సోదరుల నూతన గృహ ప్రవేశ మహోత్సవానికి ప్రేమతో వారు ఆహ్వానించగానే బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోరుట్ల నియోజకవర్గ నాయకులు సురభి నవీన్ కుమార్ హాజరై, వారి కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా పలకరించి మీకు ఎల్లవేళలా కష్టసుఖాలలో అన్నా అంటే నేనున్నానంటూ భరోసాగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు సురభి నవీన్ కుమార్ కు శ్రీరామునితో కూడిన ఆయన ఫోటో అందజేసి ప్రేమను చాటుకున్నారు. సురభి నవీన్ కుమార్ తో పాటు బీజేపీ కోరుట్ల మండల అద్యక్షులు పంచరి విజయ్ కుమార్ బీజేపీ, బీజేవైఎం నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.



# మహిళలకు ఉచిత బస్సు హామీ ఏమయ్యింది

## పల్లె వెలుగు బస్సులో ప్రయాణించిన షర్మిల

విజయవడ,అక్టోబర్18 (ప్రజా మంటలు) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల శుక్రవారం ఏపీఎస్ ఆర్టీసీకి చెందిన పల్లె వెలుగు బస్సులో ప్రయాణించారు. బస్సులో ఆమె విజయవాడ బస్ స్టాండ్ నుంచి తెనాలి వరకు ప్రయాణం చేశారు. తెలంగాణ, కర్ణాటకలో మాదిరిగానే ఏపీలో కూడా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. బస్సులో సాటి ప్రయాణికులతో ఆమె ముచ్చటించారు. ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణ సదుపాయం అవసరమా.. లేదా..? అని మహిళలను ప్రశ్నించారు.పలువురు మహిళల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అందరూ ఉచిత బస్ సౌకర్యం కావాలనే చెప్పారు. ఎన్నికలకు ముందు ఎన్డీఏ నేతలు రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారని, ఇప్పుడు ఆ హామీని ఎందుకు నెరవేర్చడం లేదని షర్మిల ప్రశ్నించారు. ఇచ్చిన హామీని మర్చిపోయారా..? అని నిలదీశారు. కాగా, ఈ సందర్భంగా మహిళా ప్రయాణికులు కొందరు షర్మిలతో సెల్ఫీలు తీసుకున్నారు.



# గ్రూప్స్ పరీక్షల నిర్వహణ పటిష్ట బందోబస్తుతో పకడ్బందీగా ఉండాలి

## వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడుతు టీఎస్పీఎస్సీ చైర్మన్ మహేందర్ రెడ్డి



జగిత్యాల అక్టోబర్ 18 (ప్రజా మంటలు) :
జిల్లాలలో గ్రూప్స్ పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు పటిష్టం చేస్తూ సన్నద్ధం కావాలని తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ మహేందర్ రెడ్డి అన్నారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ ఎం. మహేందర్ రెడ్డి గ్రూప్స్ పరీక్షల నిర్వహణకు చేయాల్సిన ఏర్పాట్ల పై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రూప్ 2, గ్రూప్ 3 పరీక్షల నిర్వహణ కోసం జిల్లాలో చేయాల్సిన ఏర్పాట్ల, తీసుకోవాల్సిన జాగ్రత్తల పై పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ కలెక్టర్లకు పలు సూచనలు జారీ చేశారు. జిల్లాలలో చేయాల్సిన ఏర్పాట్లకు సంబంధించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

ఈ సందర్భంగా తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ, గ్రూప్స్ పరీక్షల నిర్వహణకు ఎంపిక చేసిన పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసి, అవసరమైన మౌలిక వసతులు ఉన్నాయో లేవో పరిశీలించాలని, ఈ ప్రక్రియ రేపటి లోగా పూర్తి చేయాలని కమిషన్ చైర్మన్ కలెక్టర్లను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల ధృవీకరణ పూర్తయిన తర్వాత అభ్యర్థుల వివరాలతో కూడిన ఓఎంఆర్ షిట్ల ముద్రణ ప్రారంభించడం జరుగుతుందని అన్నారు. జిల్లాలో పరీక్ష ప్రశ్నా పత్రాల, ఇతర ముఖ్యమైన సామాగ్రి భద్రపర్చేందుకు స్ట్రాంగ్ రూమ్ లను గుర్తించాలని అన్నారు. పరీక్షలు సజావుగా సాగేందుకు వీలుగా జిల్లాలోని ఒక ప్రాంతంలో ఉన్న పరీక్షా కేంద్రాలకు రీజనల్ కోఆర్డినేటర్లను నియమించాలని అన్నారు. గ్రూప్ 3 పరీక్షకు 3 పేపర్, గ్రూప్ 2 పరీక్ష 4 పేపర్లు పెద్ద ఎత్తున సభ్యులు ఉన్న నేపథ్యంలో రీజనల్ కోఆర్డినేటర్ పరిధిలో స్ట్రాంగ్ రూమ్ గుర్తించాలని అన్నారు. రీజనల్ కోఆర్డినేటర్ పరిధిలో అభ్యర్థుల సంఖ్య ఆధారంగా అవసరమైన మేర స్ట్రాంగ్ రూమ్ ఉండాలని అన్నారు.

జగిత్యాల జిల్లా కలెక్టరేట్ సముదాయం నుండి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్, పోలీస్ నోడల్ అధికారి, ఆర్డీఓ అందరూ సమన్వయం చేసుకుంటున్నారని, జిల్లాలో 34 సెంటర్లను గుర్తించడం జరిగిందని, జగిత్యాల జిల్లా నుండి సుమారు 11 వేల మంది అభ్యర్థులు హాజరవుతున్నట్లు, ఇందుకు సంబంధించి ఎటువంటి ఇబ్బందులు లేవని ఆయన తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ గౌతమ్ రెడ్డి, ఆర్డీఓ మధుసూధన్, ఏఎస్పీ భీమ్ రావు, కలెక్టరేట్ ఏ. ఓ. హన్మంత రావు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## " గల్ఫ్ గాయం" డా షేక్ చాంద్ పాషా బయోగ్రఫీ
## ముంబై మేయర్ హాల్లో ఆవిష్కరణ

ముంబై అక్టోబర్ 18 (ప్రజా మంటలు) :
గల్ఫ్ కార్మికుల కోసం గత రెండు దశబ్దాలు గా నిరంతరం పోరాటం చేస్తు వారి పక్షాన అండగా నిలబడి ఎన్ ఆర్ ఐ పాలసీ జాతీయ స్థాయిలో అమలు చేయాలనీ, పోరాటం చేసిన, డా షేక్ చంద్ పాషా, "గల్ఫ్ గాయం" పేర డా. షేక్ చంద్ పాషా బయోగ్రఫీ పుస్తకం ముంబై మేయర్ హాల్లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం లో ముఖ్య అతిధులుగా డా, సుదీర్ తరే . మిస్టర్ మంగేష్ నాయక్. డా, విమాల్ సఫనా. డా, సందీప్ బటియా. జడ్జి లు. రిటైర్డ్ ఆర్మీ వారు పాల్గొన్నారు. తరువాత సూన్య సే శిఖర్ ఫాండేషన్ చైర్మన్ చేతుల మీదగా రాష్ట్ర రత్న అవార్డు అందుకున్నారు. అనంతరం డా, సయ్యర్ సమీనా పర్వీన్ (ప్రభుత్వ ఉపాధ్యయురాలు) రాసిన ఇంద్ర దనుస్సు పుస్తకం జైలర్ సంఘమిత్ర ఇతర అతిధుల చేతుల మీదగా ఆవిష్కరించారు.





## ఉద్యోగం సాధించిన యువకున్ని అభినందించిన ఎమ్మెల్యే డా సంజయ్

జగిత్యాల అక్టోబర్ 18 ( ప్రజా మంటలు):
పట్టణములోని పదవ వార్డు లింగంపేట కి చెందిన నక్క రాజేష్ ఇటీవల ప్రకటించిన డీఎస్సీ ఫలితాలలోస్కూల్ అసిస్టెంట్ సోషల్ విభాగంలో ఉద్యోగం సాధించి జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలువగా నక్క రాజేష్ కు శుభాకాంక్షలు తెలిపి, జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ అభినందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ తురగ రాజిరెడ్డి,మాజీ కుమ్మరి సంఘం శ్రీనివాస్, కిషన్,లక్ష్మి రాజం,దేవేందర్, జంగ గంగాధర్, కొత్తురి నర్సయ్య, కౌన్సిలర్ ముస్కు నారాయణ రెడ్డి ,బోనగిరి నారాయణ,దుమాల రాజ్ కుమార్, రంగు మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# జమ్మికుంట(కొత్తపల్లి) విద్యుత్ సబ్ స్టేషన్ మరమ్మతులు

జమ్మికుంట అక్టోబర్ 18 (ప్రజా మంటలు) :
జమ్మికుంట (కొత్తపల్లి) సబ్ స్టేషన్ లో మరమ్మతులు చేస్తున్నందువల్ల, ఈ సబ్ స్టేషన్ ఫారిధిలోని గ్రామాలలో శనివారం కొంత కాలం విద్యుత్ అంతరాయం కాలగుతుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని విద్యుత్ అధికారులు కోరారు. విద్యుత్ అంతరాయం ఏర్పడు ప్రాంతాలు కొత్తపల్లి, ధర్మారం,రామన్నపల్లి , మడిపల్లి మరియు ఇల్లంతకుంట మధ్యాహ్నం 3.30 %ూవీ% నుంచి 5 %ూవీ% వరకు మాచనపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ యందు మరమ్మతులు చేస్తున్నందువల్ల విద్యుత్ అంతరాయం కలుగును. కావున వినియోగదారులు గమనించి సహకరించగలరు. విద్యుత్ అంతరాయం ఏర్పడు ప్రాంతాలు మోతుకులగూడెం, జమ్మికుంట ఇండస్ట్రియల్ నుండి బస్టాండ్ వరకు మరియు మాచనపల్లి గ్రామం, ఇందిరానగర్ , శాలపల్లి.





## ఘనంగా ముద్దు రామకృష్ణయ్య 118 వ జయంతి వేడుకలు

జగిత్యాల అక్టోబర్ 18 (ప్రజా మంటలు) :
జిల్లా కేంద్రంలోని వైశ్య భవనంలో ముద్దు రామకృష్ణయ్య 118 వ జయంతి వేడుకలు రామకృష్ణయ్య విద్యా సేవ సదన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన శిష్యులు ,అభిమానులు పాల్గొని రామకృష్ణయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ రామ కృష్ణయ్య చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సేవాసదన్ ప్రధాన కార్యదర్శి సూరజ్ శివ శంకర్ ,పెద్ది ఆనందం, దేవరశెట్టి జనార్ధన్ బాపురెడ్డి ,వెంకటరమణ, కనకతార ,నాగమణి, ఆనందం ,కైలాసం, శ్యాంసుందర్, లక్ష్మీకాంతరావు, ప్రభాకర్, పిల్లి బాలకృష్ణ సి.గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## ముదిరాజ్ లను బీసీ డీ నుంచి బీసీ ఏ లోకి మార్చాలి
### ఘనంగా ఎమ్మెల్సీ బండ ప్రకాశ్ బర్త్ డే వేడుకలు



సికింద్రాబాద్, అక్టోబర్ 18 ( ప్రజామంటలు ) :
దశాబ్దాల కాలంగా పెండింగ్ లో ఉన్న ముదిరాజ్ కమ్యూనిటీ బీసీ డీ నుంచి బీసీ ఏ గ్రూప్ లోకి మార్చే ప్రతిపాదనను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని రాష్ట్ర ముదిరాజ్ నాయకులు డిమాండ్ చేశారు. జనాభాలో అత్యధికంగా ఉన్న ముదిరాజ్ లు రాజకీయ, సామాజిక, ఉద్యోగ రంగాల్లో మాత్రం వెనకబడి ఉన్నారని వారు అన్నారు. శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ ముదిరాజ్ జన్మదినాన్ని పురస్కరించుకొని పలువురు ముదిరాజ్ నేతలు శుక్రవారం ఆయన ఇంటికి వెళ్ళి బర్త్ డే విషేస్ చెప్పారు. బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి బండ ప్రకాశ్ భవిష్యత్ లో మరిన్ని పుట్టిన రోజులు జరుపుకోవాలని, ప్రజా సేవలో తరంచాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో రాష్ట్ర ముదిరాజ్ సంఘ నాయకులు మర్రి ప్రభాకర్ ముదిరాజ్, పొట్లకాయల వెంకటేశ్వర్లు, ఎం.రవికాంత్, బాలు, ఓయూ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం



గొల్లపల్లి అక్టోబర్ 18 (ప్రజా మంటలు) :
గొల్లపల్లి లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ ముస్కు కరుణాకర్ రెడ్డి ఆధ్వర్యంలో రేకుర్తి కంటి ఆసుపత్రి చైర్మన్ లయన్ కొండ వేణుమూర్తి, వైస్ చైర్మన్ లయన్ చిదుర సురేష్ సహకారంతో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి భారీ స్పందన లభించింది. గొల్లపల్లి రెడ్డి సంఘ భవనంలో శుక్రవారం నిర్వహించిన కంటి వైద్య శిబిరానికి వివిధ గ్రామాల నుంచి నేత సంబంధిత వ్యాధులతో బాధపడే రోగులు శిబిరానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా 50 మందిని పరీక్షించగా 30 మందిని కంటి ఆపరేషన్ కోసం గుర్తించారు. వీరినిలయన్స్ క్లబ్,రేకుర్తి కంటి ఆసుపత్రి బస్సులో తరలించారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ అధ్యక్షులు మస్కు కరుణాకర్ రెడ్డి, ఉపాధ్యక్షులు బొమ్మన కుమార్,కార్యదర్శి సాయిని నరహరి, కోశాధికారి శాతల సత్యనారాయణ, మహంకాళి శేఖర్, బోల్లం రమేష్, బల భక్తుల కిషన్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## గోధుర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు షూస్ పంపిణీ..

ఇబ్రహీంపట్నం అక్టోబర్ 18 (ప్రజా మంటలు) :
ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని గోదురు గ్రామంలోని ఉన్నత ప్రాథమిక పాఠశాలలో పేద విద్యార్థులకు సింగల్ పేరెంట్ పిల్లలకు గోధుర్ గ్రామ మాజీ ఉపసర్పంచ్ నల్ల తిరుపతిరెడ్డి. మరియు మాజీ వార్డ్ నెంబర్ బైరి వెంకటస్వామి. ఇరువురు కలిసి పదివేల విలువగల షూస్ పంపిణీ చేశారు. ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బండారి మధుగారు మరియు ఉపాధ్యాయ బృందం వారిని సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.



# అక్టోబర్ 21 నుండి పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలు ప్రారంభం

## జిల్లా ఎస్పీ అశోక్ కుమార్



జగిత్యాల అక్టోబర్ 18 (ప్రజా మంటలు) :
పోలీస్ అమరవీరుల ప్రాణ త్యాగాల సంస్మరణ లో భాగంగా ఈనెల 21న "పోలీస్ ఫ్లాగ్ డే" కార్యక్రమంలో స్మృతి పరేడ్ నిర్వహించి అమర వీరుల త్యాగానికి నివాళులు అర్పించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ తెలియజేయడం జరిగింది.పోలీస్ అమరవీరుల ప్రాణ త్యాగాల స్మరణలో భాగంగా ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం "పోలీస్ ఫ్లాగ్ డే " సందర్భంగా సంస్మరణ కార్యక్రమాలను అక్టోబర్ 21 నుండి జాతీయ ఐక్యత దినోత్సవం అక్టోబర్ 31వ (తేది :21- 10- 2024 నుండి 31 -10 -2024) వరకు కార్యక్రమాలు నిర్వహించనున్నారని జిల్లా ఎస్పి అశోక్ కుమార తెలిపారు.

**ఓపెన్ హౌస్ కార్యక్రమం**

జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ప్రైవేటు, పాఠశాలల్లో, కళాశాలలో ఆన్లైన్ లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విద్యార్థులకు పోలీసులు వినియోగించే ఆయుధాలు, చేయు విధులు, అత్యవసర పరిస్థితుల్లో చేయవలసిన అంశాలపై, పోలీసులు చేసిన ప్రతిభ, తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడం. ఆఫ్లైన్ ద్వారా ప్రతి పోలీస్ స్టేషన్లో మండల ల వారీగా విద్యార్థులను పోలీస్ స్టేషన్కు ఆహ్వానించి పోలీస్ స్టేషన్ నిర్వహణపై అవగాహనను కల్పించనున్నారు.

**వ్యాసరచన పోటీలు**

ఆన్లైన్ లో https://forms.gle/bYgaoMWk7CLJyVn ఈ వెబ్ సైట్ ద్వారా విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించడం జరుగుతుంది. వ్యాసరచన పోటీలు మూడు భాషల్లో తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో అభ్యర్థులు పాల్గొనవచ్చును. వ్యాసరచన పోటీలు కేటగిరీల వారిగా : కేటగిరి-1: స్టూడెంట్స్ కు ఇంటర్మీడియట్ వరకు(విచక్షణతో కూడిన మొబైల్ ఫోన్ వాడక,. కేటగిరి-2: డిగ్రీ ఆపై విద్యార్థులకు-,తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో నా పాత్ర అనే అంశాల మీద విద్యార్థులకు "ఆన్లైన్ నందు వ్యాసరచన పోటీలు" నిర్వర్తించడం జరుగుతుంది. ఆన్లైన్లో 28 అక్టోబర్ 2024 వరకు సమర్పించవచ్చును. ప్రతిభ కనబరిచిన ముగ్గురు అభ్యర్థులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచి బహుమతులు సంపాదించాలని అన్నారు.

**షార్ట్ ఫిలిమ్స్, ఫోటోగ్రఫీ పోటీలు**

జిల్లా పరిధిలో విద్యార్థిని, విద్యార్థులకు, యువతకు, ఔత్సాహిక ఫోటోగ్రాఫర్లకు, వీడియో గ్రాఫర్లకు, పోలీసులు చేసిన సేవలకు సంబంధించిన ఫోటోలు లేదా రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలు, కమ్యూనిటీ పోలీసింగ్, మూఢనమ్మకాలు, ఇతర సామాజిక రుగ్మతలు అత్యవసర సమయాల్లో పోలీసుల స్పందన, ప్రకృతి వైపరీత్యాలలో పోలీసుల సేవ, ఇతర పోలీసుల కీర్తి ప్రతిష్టలను పెంపొందించే అంశాలపై మూడు నిమిషాలకు మించకుండా షార్ట్ వీడియోలను రూపొందించాలని, ప్రతిభ కనబరిచిన మొదటి మూడు ఫోటోలను, వీడియోలను రాష్ట్రస్థాయికి ఎంపిక చేసి రాష్ట్ర పోటీల్లో పాల్గొనే విధంగా అర్హత లభిస్తుందని తెలియజేశారు. ఫోటోలు, వీడియోలు ఈనెల తేది: 20-10-24 లోపు సంబంధిత పోలీస్ స్టేషన్లలో అందించాలన్నారు.

రక్తదాన శిబిర కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. పోలీస్ అమరవీరుల స్మరిస్తూ పోలీస్ వారి ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ. పోలీస్ అమరవీరుల కుటుంబాలకు దగ్గరికి వెళ్లి వారి త్యాగాలకు గుర్తుగా నివాళులు అర్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. నెల 21వ తేదీ నుండి 31వ తేదీ వరకు పబ్లిక్ స్థలాల్లో, పోలీస్ అమరవీరుల గురించి తెలుపుతూ పోలీస్ కళా బృందం తో పాటల కార్యక్రమాలు నిర్వహించడం జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ ల పరిదిలోని ప్రధాన కూడళ్ళ వద్ద పోలీస్ అమరవీరుల బ్యానర్లను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.



# శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో సామూహిక కుంకుమార్చనలు

జగిత్యాల అక్టోబర్ 18 (ప్రజా మంటలు) :
జిల్లా కేంద్రం అరవింద నగర్ లోని శ్రీ అభయాంజనేయ స్వామి, శివ పంచాయతన, లలితా మాత దేవాలయం లో, దసరా శరన్నవరాత్రులలో పంచ లోహ శ్రీ చక్రంను పౌరాణిక, జ్యోతిష్య, వేద పండితులు శ్రీ మాన్ నంబి వేణు గోపాల ఆచార్య కౌశిక చేప్రతిష్టించారు. ప్రతి శుక్రవారం మాతలచే సామూహిక కుంకుమ పూజలు చేయడానికి నిశ్చ యించారు. ఈ రోజు నుండి ప్రతి శుక్రవారం మన ఆలయం లో కుంకుమ పూజలు జరుగుతాయని, ఆలయ ఉపాధ్యక్షుడు కొత్త మోహన్ మాట్లాడుతూ తెలిపారు . ఉష్టూరి రమ, కొత్త పెల్లి తనూజ, విరబత్తిని పద్మజ తౌటు రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు ఆర్థికంగా ఎదుగాలి..

## మెప్మా పిడి స్వరూప రాణి



జమ్మికుంట అక్టోబర్ 18 (ప్రజా మంటలు) :
ప్రస్తుత పోటీ సమాజంలో మహిళలు ఆర్థికంగా ఎదుగుతూ, ముందుకు నడవాలని మెప్మా పిడి స్వరూప రాణి, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ దేశిని స్వప్న కోటిలు అన్నారు. జమ్మికుంట మున్సిపాలిటీ పరిదిలో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఇందిరా మహిళా శక్తి కాంటీన్ ను మెప్మా పిడి స్వరూప రాణి, డిఎంసి శ్రీవాణి, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ దేశిని స్వప్న కోటి, మున్సిపల్ మేనేజర్ రాజిరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మెప్మా పిడి స్వరూప రాణి, వైస్ చైర్ పర్సన్ దేశిని స్వప్న కోటి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా కోటి మహిళలు కోటీశ్వరులు అనే కార్యక్రమం ఏర్పాటు చేసిందని, అందులో భాగంగానే ఇందిరా మహిళా శక్తి కింద శ్రీ లక్ష్మి %×% సమాఖ్యలోని సంఘ సభ్యులు గ్రూప్ గా ఏర్పాటు అయి కాంటీన్ ను ఏర్పాటు చేసుకున్నారు. ఇందులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలు వారికీ అందించారు. కాంటీన్ వంటి గ్రూప్ యూనిట్లు, ఇండివిద్యుఆల్ యూనిట్ లను ఏర్పాటు చేసుకొని ఆర్థికంగా ఎదుగలని వారు అన్నారు. అనంతరం ఇండివిద్యుఅల్ యూనిట్లు 51, గ్రూప్ యూనిట్లు 9 లో పిడి స్వరూప రాణి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు సాయిని రమ, వీరన్న, దేశిని రాధ సదానందం, ఎలగందుల స్వరూప శ్రీహరి, మెప్మా ఇంచార్జి టిఎంసి మానస, సీఎల్ ఆర్పీలు జ్యోతి, మంజుల, ఆర్పీలు విజయ, అనూషలతో పాటు పలువురు పాల్గొన్నారు.



# కొండగట్టు జేఎన్టీయూ కాలేజీని యూనివర్సిటీగా తీర్చిదిద్దేందుకు కృషి

**నిరుద్యోగ నిర్మూలనే లక్ష్యంగా పనిచేస్తా**

**ప్రైవేటు ఉద్యోగులకు హెల్త్ కార్డుల మంజూరికి ప్రయత్నిస్తా**

**జిల్లా కేంద్రంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ డాక్టర్ వి నరేందర్ రెడ్డి విస్తృత ప్రచారం**

జగిత్యాల అక్టోబర్ 18(ప్రజా మంటలు) :
ఉత్తర తెలంగాణకు తలమానికంగా ఉన్నకొండగట్టు జేఎన్టీయూను యూనివర్సిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని, నిరుద్యోగ నిర్మూలనే ధ్యేయంగా పనిచేస్తానని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ డాక్టర్ వి నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో విస్తృతంగా పర్యటించారు. మినీ స్టేడియం, రామాలయం, వివేకానంద స్టేడియం, మునిసిపల్ పార్క్‌లో ఎస్ కె ఎన్ఆర్ మైదానంలో వాకర్స్ తో ముఖాముఖి నిర్వహించి, అనంతరం ఓ హోటల్ లో పట్టభద్రులను కలిసి రానున్న పట్టభద్రుల ఎన్నికల్లో తనకు మద్దతు తెలిపాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న పట్టభద్రుల ఎన్నికల్లో తనను గెలిపిస్తే నిరుద్యోగ, ప్రభుత్వ ప్రైవేటు ఉద్యోగుల సమస్యలపై పోరాడుతానని .. పెద్దల సభలో చట్టాల రూపకల్పనలో ముందుంటానని... నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రథమ కర్తవ్యం కృషి చేస్తానని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న డిఏల మంజూరి విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తానని అన్నారు.. ప్రైవేటు ఉద్యోగులకు హెల్త్ కార్డుల మంజూరికి కృషి చేస్తానని అన్నారు.



జగిత్యాల జిల్లా పోస్కో కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా నియామకం అయిన చీటి రామ క్రిష్ణా రావు శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాం అందజేశారు.

# ధ్రువ జూనియర్ కాలేజీలో ఎయిడ్స్ పై అవగాహన సదస్సు



ఎల్కతుర్తి అక్టోబర్ 18 (ప్రజా మంటలు) :
హెచ్ ఐ వి, ఎయిడ్స్ అవగాహణలో బాగంగా ఈ రోజు వరంగల్ లోని ధ్రువ జూనియర్ కాలేజి మరియు శ్రీ చైతన్య స్కూల్ లోని పిల్లలకు ఆర్ డి ఎం ఏ సి బి వో వరంగల్ సిబ్బంది వి ఈశ్వర్ ప్రాజెక్టు మేనేజర్, సరస్వతి,స్వా తి అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా హెచ్ ఐ వి సోకే మార్గాలు, హెచ్ ఐ వి రాకుండా/సోకకుండా వుండాలంటే అవలంభించాల్సిన మార్గాలు, అనుకోకుండా తెలిసో తెలియకనో హెచ్ ఐ వి సోకితే ఏ ఆర్ టి మెడిసిన్స్ వాడాలని, హెచ్ ఐ వి ని ఎయిడ్స్ వ్యాధిగా మారకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే అంశంపై క్షుణ్ణంగా వివరించారు. వీటిని పూర్తిగా 2030 సంవత్సరం లోగ భారత దేశం నుండి ప్రారదోలాలని నాకో వారి సంకల్పంగా చెప్పారు.



# ఎల్ ఆర్ ఎస్ సర్వే ప్లాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్

జగిత్యాల అక్టోబర్ 18 (ప్రజా మంటలు) :
పట్టణంలోని తులసి నగర్ లో జరుగుతున్న ఎల్ ఆర్ ఎస్ ప్లాట్ల క్రమబద్ధీకరణ సరళిని రెవెన్యూ డివిజనల్ అధికారి మధుసూదన్ తో కలిసి పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ శిఖం భూముల్లో లేని ప్లాట్ల ను, రెవెన్యూ పరంగా ఎలాంటి ఇబ్బందులు లేని ప్లాట్లను రెగ్యులరైజ్ క్రమబద్ధీకరణ చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మధు సుదన్, మున్సిపల్ కమిషనర్ చిరంజీవి మరియు టౌన్ ప్లానింగ్ ఆఫీసర్, మున్సిపల్, రెవెన్యూ, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# హనుమకొండలోని షైన్ స్కూల్‌లో హెచ్ఐవి-ఎయిడ్స్ అవగాహన



హనుమకొండ అక్టోబర్ 18 (ప్రజా మంటలు) :
విద్యార్థి దశ నుండే హెచ్ఐవి, ఎయిడ్స్ పై విద్యార్థులు పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని టీబీ హాస్పిటల్ ఐసీటీసి కౌన్సిలర్ రాపర్తి సురేష్, ఆర్ డిఎంఎం స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ ఈశ్వర్ల సంపూర్ణ సురక్ష కేంద్రం మేనేజర్ ఇక్బాల్ పాషా సూచించారు. హనుమకొండ, రాంనగర్ బ్రాంచ్ షైన్ పాఠశాలలో తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా ఎయిడ్స్ నివారణ మరియు నియంత్రణ సంస్థ, ఆర్ డిఎంఎం సంస్థ ఆధ్వర్యంలో ఐ.ఈ. సి క్యాంపెయిన్ను ప్రిన్సిపాల్ ప్రగతి రెడ్డి, అధ్యక్షతన విద్యార్థులకు హెచ్.ఐ.వి/ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎయిడ్స్/హెచ్ఐవి ఎలా సంక్రమిస్తుంది, ఎలా వ్యాపించదు, రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, హెచ్ఐవి వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చిన్న చూపు లేకుండా సమాజంలో ఎలా కలిసి జీవించాలి, హెచ్ఐవి, క్షయ వ్యాధి సంబంధం, సుఖ వ్యాధులు మరియు చికిత్స గురించి, హెచ్ఐవి యాక్ట్ 2017, ఏ.ఆర్.టి. మందులు, టోల్ ఫ్రీ నెంబర్ 1097 గురించి తెలియజేస్తూ అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరికీ ఈ వ్యాధి గురించి సంపూర్ణ అవగాహన కలిగి ఉన్నపుడే రాకుండా నిరోధించుకునే అవకాశం ఉంటుందన్నారు. చిన్న వయసులోనే ఆకర్షణలలో పడి బంగారు జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని అన్నారు. ఎయిడ్స్ వ్యాధికి మందు లేదని, నివారణ ఒక్కటే మార్గం అన్నారు. పెళ్లికి ముందు శృంగారంలో పాల్గొనడం ద్వారా సుఖవ్యాధులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. ఎయిడ్స్ అంటు వ్యాధి కాదని, వ్యాధి ఉన్నవాళ్ళతో కలసి తిన్నా ఉన్నా సోకదన్నారు. కార్యక్రమంలో సంపూర్ణ సురక్ష కేంద్రం ఔట్రిచ్ వర్కర్, రాజేంద్ర ప్రసాద్, %=ఐవీవీ% స్వచ్ఛంద సంస్థ ఔట్రిచ్ వర్కర్ ఎస్.అక్షర, ఏ ఎన్ ఎం యధా లక్ష్మి, షైన్ పాఠశాల సిబ్బంది రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

# మూసీ పునరావాస మహిళా సంఘాలకు చేయూత

### రూ.3.44కోట్ల నగదు చెక్కులు పంపిణీ

### వారికి అండగా ఉంటామన్న మంత్రి మంత్రి సీతక్క



హైదరాబాద్, (ప్రజా మంటలు):
మూసీ పరివాహక ప్రాంతాల్లో నివసిస్తున్న వారికి పునరావాసం కల్పించి, వారి ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి న్యాయం చేస్తుందని మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) పేర్కొన్నారు. శుక్రవారం ప్రజా భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మూసీ పరివాహక ప్రాంతాల స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ... ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి వెళ్ళేటప్పుడు జరిగే బాధను గుర్తుచేస్తూ, ఇటీవల ఖమ్మం, మహబూబాబాద్ వంటి ప్రాంతాలు వరదల వల్ల నష్టపోయాయని, అలాగే మూసీ మురికి నీటి కారణంగా అనారోగ్య సమస్యలు వచ్చాయన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆ నీటిని త్రాగదగిన స్థాయికి తీసుకు రావడానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. బాధిత మహిళలకు రూ. 2 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామని, అందులో రూ. 1.40 లక్షలు సబ్సిడీగా ఉంటాయని, మిగిలిన రూ. 60 వేల రూపాయలు మూడు సంవత్సరాల్లో చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా వివిధ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. అనుకోకుండా వరదలు వచ్చినప్పుడు ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు సన్నద్ధంగా ఉంటామని తెలిపారు. పునరావాసం పొందిన బాధిత కుటుంబాలకు ఉచిత విద్య, అంగన్వాడీ కేంద్రాలలో ప్రవేశం, అలాగే రెండు పడకల గదుల నిర్మాణం ఉచితంగా అందించామని చెప్పారు. మూసీ రివర్ పరిరక్షణలో జిహెచ్ఎంసి అర్బన్ డెవలప్మెంట్ విభాగం ఆధ్వర్యంలో బాధితులకు న్యాయం చేకూర్చే విధంగా బాగా కృషి చేశారని మంత్రి సీతక్క ప్రశంసించారు. ప్రభుత్వ నిర్ణయం మేరకు జిహెచ్ఎంసి కమిషనర్ కృషి మేరకు బాధిత కుటుంబాలకు న్యాయం చేకూర్చడం ముఖ్య భూమిక పోషించినట్లు పేర్కొన్నారు. ఇక నుండి కూడా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మూసీ ప్రక్షాళన జిహెచ్ఎంసి పాత్ర కీలకమని మంత్రి సీతక్క ప్రశంసించారు. మలక్ పేట్ ఎమ్మెల్యే అహ్మద్ బిన్ బలాల మాట్లాడుతూ... మలక్ పేట్ నియోజకవర్గంలో మూసీ పరివాహక ప్రాంతంలో వరదలు వచ్చినప్పుడు పునరావస కేంద్రాలకు తరలించేవారమని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదని, మూసీ నిర్వాసితులకు పిల్లి గుడిసె కాలనీలో 130 కుటుంబాలకు పునరావాసం కల్పించామని తెలిపారు. మూసీలో చాలా మంది బాధ పడ్డారని ఇప్పుడు ఏ బాధ ఉండదని తెలిపారు. త్రాగునీటి సమస్యను పరిష్కరించడానికి ఆర్ ఓ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మూసీ పునరావాస మహిళా సంఘాలకు రూ.3.44కోట్లను 172 మంది మహిళలకు ఒక్కొక్కరికి 2 లక్షల చొప్పున ఆర్థిక సహాయాన్ని మలక్ పేట్, కార్వాన్ శాసన సభ్యులు అహ్మద్ బిన్ బలాల, కౌసర్ మొహమందిన్, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డిలతో కలిసి పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో సేర్ప్ సి ఇ ఓ దివ్య దేవరాజ్, మూసీ జె ఎండీ గౌతమి, శ్రీనివాస్ రెడ్డి, మూసీ ఈ డి, ఎస్.సి కార్పొరేషన్ ఎండి మల్లయ్య భట్టు, తదితరులు పాల్గొన్నారు.

## యాదగిరిగుట్టలో భక్తులకు సౌకర్యాలు మెరుగు

### మంత్రి కొండా సురేఖ వెల్లడి



హైదరాబాద్, (ప్రజా మంటలు):
యాదగిరిగుట్టలో భక్తుల సౌకర్యార్థం దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు తీసుకున్నామని మంత్రి కొండా సురేఖ అన్నారు. ఆలయంలో 14చోట్ల మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేశామని తెలిపారు. 47 చోట్ల టాయిలెట్స్ నిర్మించినట్లు చెప్పారు. విష్ణు పుష్కరిణీ గుండాన్ని ఏర్పాటు చేశామన్నారు. చంటి బిడ్డ తల్లులకు ప్రత్యేక లాంజ్‌లు, ఎలక్ట్రిక్ వాహనాల సౌకర్యం కల్పించామని చెప్పారు. రూ. 15కోట్లతో దాతల సహాయంతో అన్నదాన సత్రం నిర్మించామని మంత్రి కొండా సురేఖ అన్నారు. 60కిలోల బంగారు తాపడంతో రాజగోపురం నిర్మించాలని నిర్ణయించినట్లు తెలిపారు. లడ్డూ నాణ్యతలో జాగ్రత్తలు తీసుకుంటున్నామని అన్నారు. భద్రాద్రి అభివృద్ధి కోసం కొత్త మాస్టర్ ఎ÷-లాన్ సిద్ధం చేస్తున్నామని అన్నారు. రూ. 3కోట్లతో జానకి సదనం నిర్మిస్తున్నామని తెలిపారు. దేవాలయానికి సంబంధించిన 24సేవలు ఆన్ లైన్?లో అందిస్తున్నామని ప్రకటించారు. వేములవాడ దేవస్థానానికి చెందిన 850కోడెలను రైతులకు అందించినట్లు మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు.టీటీడీఏ(÷ఆం) కు ప్రభుత్వం రూ. 70 కోట్లు విడుదల చేసిందని ప్రకటించారు. వెండి పల్లకీలు, బంగారు తాపడం రాజగోపురం నిర్మించాలని నిర్ణయించామన్నారు. రూ.110కోట్లతో బాసర ఆలయ పునర్నిర్మానం చేస్తామన్నారు. అందుకోసం మాస్టర్ ఎ÷-లాన్ సిద్ధమైందని అన్నారు. ఆదాయం ఆధారంగా ఆలయాల వర్గీకరణ చేస్తామని వివరించారు. వివాదంలో ఉన్న దేవాదాయ, అటవీ శాఖ భూములపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని మంత్రి కొండా సురేఖ తెలిపారు.

# బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్‌కు బెదిరింపులు

### 5కోట్లు డిమాండ్ చేస్తూ పోలీసులకు మెసేజ్

### అప్రమత్తం అయిన పోలీసులు..మెసేజ్‌పై ఆరా



ముంబై,అక్టోబర్18 (ప్రజా మంటలు):
బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్ కు మరోసారి బెదిరింపులు వచ్చాయి. లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌తో ఉన్న వైరానికి ముగింపు పలకాలంటే రూ.5 కోట్లు ఇవ్వాలంటూ అగంతకులు బెదిరింపులకు పాల్పడ్డారు. ముంబయి ట్రాఫిక్ పోలీసుల వాట్సప్ నంబర్‌కు ఈ మెసేజ్ రావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. గురువారం రాత్రి ముంబయి ట్రాఫిక్ పోలీసులకు ఈ మెసేజ్ వచ్చింది. 'ఈ బెదిరింపులను తేలిగ్గా తీసుకోవద్దు. సల్మాన్ ఖాన్ ప్రాణాలతో ఉండాలన్నా.. లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌తో శత్రుత్వాన్ని ముగించుకోవాలన్నా ఆయన రూ.5కోట్లు చెల్లించాలి. ఈ డబ్బులు ఇవ్వకపోతే ఇటీవల హత్యకు గురైన మాజీ ఎమ్మెల్యే సిద్ధిఖీ కంటే ఆయన దారుణమైన పరిస్థితులు ఎదుర్కోవాల్సి ఉంటుందని దుండగులు అందులో బెదిరించారు. దీనిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించామని, మెసేజ్ ఎక్కడినుంచి వచ్చిందన్న దానిపై విచారణ జరుపుతున్నామని ముంబయి పోలీసులు వెల్లడించారు. ఈనేపథ్యంలో బాంద్రాలోని ఆయన నివాసం వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. కాగా.. సల్మాన్‌ఖాన్‌కు ఇలా బెదిరింపులు రావడం ఇదే తొలిసారి కాదు. గతంలోనూ పలుమార్లు బిష్ణోయ్ గ్యాంగ్ నుంచి ఆయనకు బెదిరింపులు వచ్చాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో సల్మాన్ నివాసం ఉంటున్న బాంద్రాలోని గెలాక్సీ అపార్ట్‌మెంట్ వద్ద ఇద్దరు వ్యక్తులు కాల్పులు జరిపిన సంగతి తెలిసిందే. ఇక, అంతకుముందు పన్వేల్ ఫామ్‌హౌస్‌లోకి చొరబడేందుకు కొందరు ప్రయత్నించడం అప్పట్లో కలకలం రేపింది. నటుడి ప్రాణాలకు ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో గతేడాది మహారాష్ట్ర ప్రభుత్వం ఆయనకు భద్రతను పెంచింది. ఇదిలాఉండగా.. సల్మాన్ ఖాన్ స్నేహితుడు, ఎన్సీపీ నేత బాబా సిద్ధిఖీ గతవారం దారుణ హత్యకు గురైన సంగతి తెలిసిందే. ముంబయిలోని బాంద్రాలో తన కుమారుడి కార్యాలయంలో ఉండగా.. ముగ్గురు దుండగులు సిద్ధిఖీపై మూడు రౌండ్లు కాల్పులు జరిపారు. వెంటనే ఆయన్ను లీలావతి ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ హత్య తామే చేసినట్లు బిష్ణోయ్ గ్యాంగ్ ప్రకటించుకుంది.




## శ్రీశైలానికి భారీగా వరదనీరు

### ఒక్కగేటు ఎత్తి నీటి విడుదల

నంద్యాల, అక్టోబర్ 18 (ప్రజా మంటలు):
ఎగువన కురుస్తున్న వర్షాలకు శ్రీశైలానికి జలాశయానికి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. శుక్రవారం ప్రాజెక్టుకు జలకళ సంతరించుకుంది. ఒక క్రస్టు గేటు 10 అడుగుల మేర ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు నిండా నీళ్లు, గేట్లు ఎత్తడంతో దిగువకు వస్తున్న నీళ్లతో ప్రాజెక్టు పరిసర ప్రాంతాలు కనుల విందు చేస్తుంది. శ్రీశైలం ప్రాజక్టు పరిసర ప్రాంతాల్లో ప్రకృతి అందాలను చూసి ఎంజాయ్ చేస్తున్నారు. శ్రీశైలం జలాశయానికి వచ్చి చేరుతున్న వరద నీటితో ఇన్ ఫ్లో పెరిగింది. ప్రస్తుతం ఇన్ ఫ్లో 93వేల 270 క్యూసెక్కులుంది. ప్రాజెక్టు పూర్తి స్థాయినీటి మట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుతం 884.50 అడుగులకు చేరింది. ప్రాజక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 215.8070 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 212.9198 టీఎంసీలు నీటి నిల్వ ఉంది. శ్రీశైలం ప్రాజెక్టు కుడి, ఎడమ విద్యుత్ కేంద్రాల్లోరెండింటిలోనూ విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది. గేట్ల ద్వారా ఔట్ ఫ్లో 95వేల 626 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు అధికారులు.

## వెనక్కు తగ్గేదిలేదు

- యుద్ధం ముగిసే వరకు బందీలను విడిచిపెట్టం
- స్పష్టం చేసిన హమాస్
- పాలస్తీనా కోసం చివరి వరకు పోరాడి యాహ్యా సిన్వర్ ప్రాణాలు కోల్పోయారు
- ఆయన మృతిని ధ్రువీకరించిన హమాస్



హమాస్ అక్టోబర్ 18 (ప్రజా మంటలు):
ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో తమ అధినేత యాహ్యా సిన్వర్ మృతి చెందినట్లు హమాస్ సైతం ధ్రువీకరించింది. పాలస్తీనా కోసం చివరి వరకు పోరాడి ప్రాణాలు కోల్పోయారని తెలిపింది. అయితే, తమ ప్రాంతంపై బాంబు దాడులు ఆపి, ఇజ్రాయెల్ దళాలు ఉపసంహరించుకొని, యుద్ధం ముగించే వరకు బందీలను వదిలిపెట్టే ప్రసక్తే లేదని హమాస్ తేల్చి చెప్పింది.హమాస్ అధినేత మృతిచెందడంపై ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు స్పందిస్తూ.. హమాస్ ఆయుధాలను వదిలి, తమ బందీలను తిరిగి పంపిస్తే ఈ యుద్ధం రేపే ముగిస్తుందని వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. అదేవిధంగా తమ పౌరులను విడిచిపెడితే హమాస్ మిలిటెంట్లకు స్వేచ్ఛగా జీవించే అవకాశం కల్పిస్తామన్నారు. లేదంటే వేటాడి మరీ హతమారుస్తామని హెచ్చరించిన నేపథ్యంలో హమాస్ నుంచి ఇటువంటి స్పందన వచ్చింది.మరోవైపు, గాజాపై ఇజ్రాయెల్ సైన్యం దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. గడిచిన 24 గంటల్లో 62 మంది మరణించగా.. 300 మందికి గాయపడ్డారు. దీంతో మొత్తంగా ఇప్పటివరకు ఇజ్రాయెల్ దాడుల్లో మృతి చెందిన వారి సంఖ్య 42,500లకు చేరుకుందని గాజా ఆరోగ్యశాఖ వెల్లడించింది. మరో లక్ష మంది గాయపడినట్లు తెలిపింది.



## వయనాడ్‌లో రంగంలోకి సిపిఐ అభ్యర్థి

### ప్రియాంకపై పోటీ పడనున్న సత్యన్ మోకెరి

తిరువనంతపురం,అక్టోబర్18 (ప్రజా మంటలు):
వయనాడ్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేయనున్న ప్రియాంక గాంధీ పై సిపిఐ అభ్యర్థిని నిలపనుంది. కేరళలోని వాయనాడ్ నుంచి ప్రియాంక పోటీ చేస్తున్న సంగతి తెలిసిందే. వామపక్షాలు సీనియర్ సిపిఐ నాయకుడు, మాజీ శాసనసభ్యుడు సత్యన్ మోకెరి(70)ని పోటీకి నిలబెట్టింది. రాహుల్ గాంధీ తన వాయనాడ్ సీటును ఖాళీ చేయడంతో ఆ సీటుకు ఇప్పుడు ఉపఎన్నిక జరుగబోతున్నది. అయితే గమనించాల్సిన విశేషమేమిటంటే ఇది ప్రియాంక గాంధీ తొలిసారి పోటీ చేస్తున్న ఎన్నికల ఘట్టం. సిపిఐ స్టేట్ కౌన్సిల్ గురువారం సమావేశమై సత్యన్ మోకెరి విషయంలో నిర్ణయం తీసుకుంది. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బినయ్ విశ్వం మాట్లాడుతూ ' మోకెరి పూర్తి స్థాయిలో పోటీపడతారు. ఆయన దేశంలో జరిగిన అనేక రైతు ఉద్యమాలకు నాయకత్వం వహించారు. మేము సీనియర్ రైతు నాయకుడిని ఎల్ డిఎఫ్ అభ్యర్థిగా వాయనాడ్ నుంచి నిలబెడుతున్నాము' అన్నారు.మోకెరి ప్రస్తుతం ఆల్ ఇండియా కిసాన్ సభకు జాతీయ కార్యదర్శిగా ఉన్నారు. అది సిపిఐ రైతు విభాగం. పైగా మోకెరి కొజికోడ్ జిల్లాకు చెందిన స్థానిక వాసి. ఆయన 1987 నుంచి 2001 వరకు మూడుసార్లు శాసనసభ్యుడిగా పనిచేశారు. ఆయన నందపురం అసెంబ్లీ సీటు కు ప్రాతినిధ్యం వహించారు. మోకెరి పార్టీ విద్యార్థి విభాగం 'ఆల్ ఇండియా స్టూడెంట్ ఫెడరేషన్' నుంచి పార్టీలో చేరారు. ఆయన 'స్టేట్ అగ్రికల్చరల్ డెట్ రిలీఫ్ కమిషన్' సభ్యుడిగా కూడా పనిచేశారు. మోకెరి 2014లో కూడా వాయనాడ్ నుంచి లోక్ సభకు పోటీ చేశారు. నాడు ఆయన కాంగ్రెస్ సిట్టింగ్ ఎంపీ ఎం.ఐ. షానవాస్ చేతిలో 20870 ఓట్ల తేడాతో ఓడిపోయారు.ఆయన తన ప్రచారం శనివారం నుంచి కొనసాగిస్తానన్నారు. 'వాయనాడ్ ప్రజలు ఎల్లప్పుడూ వామపక్ష ఉద్యమానికి తోడుగా నిలబడ్డారు. మేము రాజకీయ విధానంలోనే ఓటర్ల వద్దకు వెళ్లి ఓట్లడుగుతాము' అన్నారు.

## ఆప్ నేత సత్యేంద్ర జైన్‌కు భారీ ఉరట

### రెండేళ్ల తరవాత ఢిల్లీ కోర్టు బెయిల్ మంజూరు



న్యూఢిల్లీ, (ప్రజా మంటలు):
ఆప్ సీనియర్ నేత, ఢిల్లీ ఆరోగ్యశాఖ మాజీ మంత్రి సత్యేందర్ జైన్ కు భారీ ఊరట లభించింది. మనీలాండరింగ్ కేసులో అరెస్టయిన రెండేళ్ల తర్వాత బెయిల్ వచ్చింది. శుక్రవారం ఢిల్లీ కోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కోల్‌కతాకు చెందిన ఓ కంపెనీకి సంబంధించి లావాదేవీల విషయంలో మనీలాండరింగ్‌కు పాల్పడ్డారన్న ఆరోపణలపై 2022 మే 30న సత్యేందర్ జైన్‌ను ఈడీ అధికారులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. 2015-16 సమయంలో హవాలా నెట్‌వర్క్ ద్వారా జైన్ కంపెనీలకు.. షెల్ కంపెనీల నుంచి సుమారు రూ.4.81 కోట్ల వరకు ముట్టినట్లు ఈడీ దర్యాప్తులో గుర్తించింది. సీబీఐ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా రంగంలోకి దిగిన ఈడీ అధికారులు.. ఈ హవాలా కేసును దర్యాప్తు చేశారు. ఈ క్రమంలోనే సత్యేందర్‌తో పాటు ఆయన కుటుంబానికి చెందిన రూ.4.81 కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేసి ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో వైద్య కారణాలతో గత ఏడాది మేలో సుప్రీంకోర్టు ఆయనకు తాత్కాలిక బెయిల్ ఇచ్చింది. అయితే రెగ్యులర్ బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించడంతో తిరిగి మళ్లీ తిహాడ్ జైలుకు వెళ్లాల్సి వచ్చింది. ఇదిలా ఉంటే.. ఢిల్లీ మద్యం పాలసీ వ్యవహారంలో మనీలాండరింగ్ ఆరోపణలపై ఆప్ నేతలు కేజ్రీవాల్, మనీశ్ సిసోదియా, సంజయ్ సింగ్ వంటి ముఖ్య నేతలు కొన్ని నెలల పాటు జైలులో ఉండగా.. ఇటీవల వారికి ఊరట లభించిన సంగతి తెలిసిందే. ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ కు గత నెల సుప్రీంకోర్టు (÷ూబూస।ప। అనీబీసబి) బెయిల్ మంజూరు చేయగా.. దాదాపు ఆరు నెలల తర్వాత ఆయన తిహాడ్ జైలు నుంచి బయటకు వచ్చారు. ఇదే కేసులో 17 నెలల పాటు జైల్లో ఉన్న ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోదియాకు కూడా కొద్దినెలల క్రితం బెయిల్ లభించింది. ఈ పరిణామాల నేపథ్యంలో తాజాగా సత్యేందర్ జైన్‌కు బెయిల్ రావడంతో ఆప్ శ్రేణుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

### ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలపై భారం

సిపిఎం ఆధ్వర్యంలో మైలవరంలో ర్యాలీ

విజయవాడ,అక్టోబర్18 (ప్రజా మంటలు):
ట్రూ అప్ చార్జీలపేరుతో రూ.8, 114 వేల కోట్ల భారాన్ని ప్రజలపై మోపద్దని సిపిఎం పార్టీ మైలవరం మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మైలవరం పురవీధుల్లో ర్యాలీ నిర్వహించి గాంధీ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆంజనేయులు, కోట కళ్యాణ్ లు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి వత్తాసు పలుకుతూ పెట్టుబడి దారులకు కొమ్ముకాస్తూ ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలపై భారాలు మోపాలని చూస్తున్నారని, గతంలో కూడా టిడిపి అధికారంలో ఉన్న సమయంలో కరెంట్ చార్జీలకు వ్యతిరేకంగా పోరాటం చేశారని మరల ఈ ప్రభుత్వానికి తగిన విధంగా బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సిహెచ్ సుధాకర్, మండల కమిటీ సభ్యులు రావూరి రమేష్ బాబు, సిహెచ్ సుబ్బారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, లంక వెంకటేశ్వరరావు, మంద స్వామి, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

DIGITALLY PRINTED AND PUBLISHED BY CH.V. PRABHAKAR RAO AT 6-3-144, bRAHMAN WADA, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL 2021/81092
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com